www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
గురువారం | 23 | ఏప్రిల్ | 2026 పేజీలు : 8

## ఇన్నయ్యతో మీకు ఉన్న సంబంధాలు ఏమిటి..?



-అమరులకు జోహార్లు అంటే మద్దతు ప్రకటించినట్లేగా
-పోటు రంగారావును ప్రశ్నించిన ఎన్ఐఏ అధికారులు

2లో

# స్తంభించిన ప్రజా రవాణా







2లో

-ఆర్టిసి సమ్మె సంపూర్ణం, ప్రశాంతం
-డిమాండ్లు పరిష్కారమయ్యేంత వరకు ఆందోళన
-ఖమ్మం రీజియన్‌లో నడవని బస్సులు
-సిపిఐ, ఏఐటియుసి, ప్రజా సంఘాల సంపూర్ణ మద్ధతు

**ఆర్టిసి సమ్మెతో ప్రజా రవాణా స్తంభించింది. 32 డిమాండ్లతో సమ్మె నోటీసు ఇచ్చిన ఆర్టిసి జేఏసి మంగళవారం అర్థరాత్రి నుంచి సమ్మె ప్రారంభించింది.** ఆర్టిసిలోని ఒకట్రెండు చిన్న చితక సంఘాలు తప్ప ప్రధాన యూనియన్లు సమ్మెలో పాల్గొనడం సమ్మెకు మద్దతునివ్వడంతో సమ్మె సంపూర్ణంగా జరిగింది. ఖమ్మం రీజియన్ పరిధిలోని ఖమ్మం, మధిర, సత్తుపల్లి, కొత్తగూడెం, భద్రాచలం, మణుగూరు, ఇల్లందు డిపోల వద్దకు కార్మికులు, కమ్యూనిస్టు పార్టీ, ప్రజా సంఘాల నాయకులు డిపోల నుంచి బస్సులు బయటకు రాకుండా అడ్డుకున్నారు. ఖమ్మంలో వివిధ సంఘలతో పాటు సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, కొత్తగూడెంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్‌పాషా ఆందోళనలకు మద్దతునిచ్చారు. పలువురిని పోలీసులు అరెస్టు చేసి వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. ప్రత్యామ్నాయ రవాణా ఏర్పాట్లు చేస్తామని ప్రకటించిన అధికార యంత్రాంగం చేతులేత్తేసింది. అరకొరగా అద్దె బస్సులు తిప్పింది. మహిళలతో పాటు పురుషులకు కూడా ఉచిత ప్రయాణం కల్పించారు. కారణం ఏమిటంటే కండక్టర్లు లేకపోవడంతో డ్రైవర్లు మాత్రమే ఉండడం వల్ల టికెట్లు కొట్టేవారు లేక ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించారు. మొత్తంగా ఆర్టిసి సమ్మె ప్రజా రవాణాపై తీవ్ర ప్రభావం చూపింది. రోజు వారి ప్రాతిపదికన కండక్టర్లను, డ్రైవర్లను నియమించేందుకు యాజమాన్యం ప్రయత్నిస్తుందన్న సమాచారం. డ్రైవర్లకు రూ.1000, కండక్టర్లకు రూ.800 ల చొప్పున రోజు వారి వేతనంతో పని చేయించేందుకు ప్రయత్నిస్తున్నారు. -ప్రజాపక్షం/ఖమ్మం







### వేగవంతంగా యాతాలకుంట
## టన్నెల్ పనులు పూర్తి చేయాలి





ప్రజాపక్షం/సత్తుపల్లి: సీతారామ ఎత్తిపోతల పథకం యాతాలకుంట టన్నెల్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. బుధవారం ఉమ్మడి ఖమ్మం జిల్లాల కలెక్టర్‌లు

మిగతా 2లో..

-ఉమ్మడి ఖమ్మం జిల్లాకు సీతారామ ద్వారా గోదావరి సాగునీరు సరఫరా
-యాతాలకుంట టన్నెల్ పనులను పరిశీలించి, సమీక్షించిన మంత్రి తుమ్మల

### రైతులకు బేడీలు వేసిన మీరా..
## రైతుల గురించి మాట్లాడేది..?



ప్రజాపక్షం/నేలకొండపల్లి : రైతులకు బేడీలు వేసిన చరిత్ర కలిగిన వారు రైతుల గురించి మాట్లాడుతుంటే హస్యాస్పదంగా ఉందని రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. మండలం లోని నాచేపల్లి సోసైటీ ఆధ్వర్యంలో బౌద్ధక్షేత్రం వద్ద ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వరి వేస్తే ఉరి అన్న గత పాలకులు రైతుల పట్ల మొసలి కన్నీరు కారుస్తున్నారని అన్నారు. రైతులకు బేడీలు వేసి నడిపించినపాలకులు వారి గత చరిత్ర ను గుర్తు చేసుకోవాలని సూచించారు.ప్రతిపక్షాలు చేప్పే కల్లబొల్లి మాటలు ప్రజలు వినే పరిస్థితి లో లేరని అన్నారు. వరికి

మిగతా 2లో..

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి పొంగులేటి

# స్తంభించిన ప్రజా రవాణా

**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఆర్టీసి కార్మికుల సమ్మె తొలి రోజు తీవ్ర ప్రభావాన్ని చూపింది. ఖమ్మం రీజియన్‌లో బస్సుల రాకపోకలు నిలిచిపోయాయి. తెల్లవారు జాము నుంచే డిపోల వద్దకు చేరుకుని బస్సులు బయటకు రాకుండా అడ్డుకున్నారు. ఆర్టిసి జేఏసి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ప్రధానమైన డిమాండ్లను పరిష్కరించాలని లేని పక్షంలో సమ్మె కొనసాగుతుందని కార్మిక సంఘాల నేతలు తెలిపారు. 2019లో జరిగిన సమ్మె నాటి డిమాండ్లనే ఇప్పుడు ప్రభుత్వం ముందు ఉంచామని అయినా పరిష్కారానికి చొరవ చూపడం లేదని కార్మిక సంఘాల నేతలు ఆరోపించారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే ఆర్టిసి విలీనం జరిగిన ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడంలో జాప్యం జరిగిందని తాము అధికారంలోకి వస్తే ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడంతో పాటు ఆర్టిసిని ఆధునీకరిస్తామని, వేతన బకాయిలను చెల్లిస్తామని, ఒకటో తారీఖునే వేతనాలు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం ఎందుకు తాత్సర్యం చేస్తుందని కార్మిక సంఘాల నేతలు ప్రశ్నించారు. ప్రభుత్వం తక్షణం చర్చలకు పిలిచి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు. కాంగ్రెస్ తన ఎన్నికల మేనిఫెస్టోలో తాము అధికారంలోకి వస్తే ఆర్టిసిలో యూనియన్లను పునరుద్ధరిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చిందని ఇప్పుడు ఆ హామీని ఎందుకు విస్మరిస్తున్నారని సంఘాల నేతలు ప్రశ్నించారు. సమ్మెకు ఆర్టిసి ఎంప్లాయిస్ యూనియన్ నేషనల్ మజ్దూర్ యూనియన్, తెలంగాణ మజ్దూర్ యూనియన్, ఎస్సి, ఎస్టి ఎంప్లాయిస్ అసోసియేషన్, కార్మిక సంఘ్, కార్మిక పరిషత్‌లు జేఏసిలుగా ఏర్పడి పని చేస్తుండగా స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ జేఏసికి మద్దతునిచ్చింది. తొలి రోజు ఆందోళనలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు పోటు కళావతి, ఏఐటియుసి నాయకులు గాదె లక్ష్మీ నారాయణ, తోట రామాంజనేయులు, పేరబోయిన మోహన్‌రావు, సిఐటియు నాయకులు విష్ణు, ఏఐఎస్ఎఫ్ నాయకులు రామకృష్ణ, ఏఐవైఎఫ్ నాయకులు శ్రావణ్, జేఏసి నాయకులు పిల్లి రమేష్, బివిఎస్ రెడ్డి, నాగయ్య, ఎల్‌ఆర్‌కె రావు, ఎంఆర్ నాథ్, పిట్టల సుధాకర్, బేతంపూడి బుచ్చిబాబు, అనిత, రామలక్ష్మి , సుజాత, వినోద్‌కుమార్, మాధవరావు, రోశయ్య పాల్గొన్నారు.

# ఇన్నయ్యతో మీకు ఉన్న సంబంధాలు ఏమిటి..?




**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఇన్నయ్యతో మీకు ఉన్న సంబంధాలు ఏమిటి...? మీకు ఎలా పరిచయం అమర వీరులకు జోహార్లు అని నినదించడమంటే మావోయిస్టు పార్టీ సిద్ధాంతాన్ని కొనసాగించడమేగా అంటూ జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) అధికారులు పోటు రంగారావును ప్రశ్నించారు. బుధవారం ఖమ్మంలోని సిపిఐ(ఎంఎల్)మాస్‌లైన్ కార్యాలయం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో ఎన్ఐఏ అధికారులు రెండు గంటల పాటు పోటు రంగారావును ప్రశ్నించారు. ప్రశ్నించడం పూర్తయిన తర్వాత పోటు రంగారావు మీడియాతో మాట్లాడుతూ ఇన్నయ్యతో మీకు ఉన్న సంబంధాలు ఏమిటని తనను ప్రశ్నించారని తనకు ఇన్నయ్యతో ఎటువంటి సంబంధాలు లేవని ఒక సందర్భంలో మాత్రమే ఆయనను చూశానని తాను సమాధానం ఇచ్చినట్లు రంగారావు తెలిపారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఒకసారి వేదికపై కలవడం జరిగిందని తెలపగా హిడ్మా అంత్యక్రియల సమయంలో హిడ్మా తల్లి వెళ్లిన వీడియో మీకెందుకు పంపాడని తనను ప్రశ్నించారని రంగారావు తెలిపారు. భారత్ బచావో సంస్థ కరపత్రం పంపించారని కానీ నేను ఆ కార్యక్రమంలో పాల్గొనలేదని తెలిపినట్లు రంగారావు తెలిపారు. గాదె ఇన్నయ్యకు తాను ఎటువంటి ఆర్థిక సాయం అందించలేదని వారు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చానన్నారు. మావోయిస్టు పార్టీ సంబంధించిన అమరులకు జోహార్లు అర్పించడమంటే ఆ సిద్ధాంతాన్ని కొనసాగించడమే కదా అని అధికారులు ప్రశ్నించారని అమరులకు జోహార్లు అర్పించడమనేది అందరూ చేస్తుంటారని కేసిఆర్, రేవంత్ రెడ్డి సైతం అమరులకు జోహార్లు అంటుంటారని తాను సమాధానం ఇచ్చానన్నారు. అమరుల ఆశయాలు సాధించడం అంటే ఏమిటని ప్రశ్నించారని కార్పొరేట్ వర్గాలకు వ్యతిరేకంగా పోరాడటం, సోషలిస్టు సమాజాన్ని స్థాపించడం, దోపిడీ వ్యవస్థను రద్దు చేయడం మొదలైనవని తాను సమాధానం ఇచ్చినట్లు రంగారావు తెలిపారు. ఉపా చట్టాన్ని ఎందుకు వ్యతిరేకిస్తున్నారని ప్రశ్నించగా తాను కాదని యావత్ సమాజం ఉపాను వ్యతిరేకిస్తుందని సమాధానం ఇచ్చినట్లు రంగారావు తెలిపారు. మీడియా సమావేశంలో నాయకులు గుమ్మడి నర్సయ్య, ఆవుల వెంకటేష్, ఆవుల వెంకటేశ్వర్లు, గుర్రం అచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

# వేగవంతంగా యాతాలకుంట టన్నెల్ పనులు పూర్తి చేయాలి

**(మొదటిపేజీ తరువాయి)**

సీతారామ ఎత్తిపోతల పథకం యాతాలకుంట టన్నెల్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. బుధవారం ఉమ్మడి ఖమ్మం జిల్లాల కలెక్టర్ లు అనుదీప్ దురిశెట్టి, అంకిత్ లతో కలిసి మంత్రి తుమ్మల విస్తృతంగా పర్యటించారు. సత్తుపల్లి మండలంలో సీతారామ ప్రాజెక్టు క్రింద నిర్మిస్తున్న యాతాలకుంట టన్నెల్ నిర్మాణ పనులను పరిశీలించి, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ లు అశ్వారావుపేట ఎమ్మెల్యే లు జారే ఆదినారాయణ లతో కలిసి, సంబంధిత అధికారులతో మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌లో భాగమైన సత్తుపల్లి ట్రంక్ కాలువ పనులను వేగవంతం చేసి రాబోయే వర్షాకాలానికి సత్తుపల్లి ఆయకట్టుకు గోదావరి జలాలు అందించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. సీతారామ ఎత్తిపోతల పథకం ద్వారా మెయిన్ కెనాల్, 3 పంప్ హౌస్ లు ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించుకున్నామన్నారు. సత్తుపల్లి మండలంలోని యాతాలకుంట టర్మినల్‌కు సంబంధించిన మొత్తం 1.78 కిలోమీటర్ల పనుల్లో చివరి 30 మీటర్ల పనులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని 15 రోజుల్లో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. గోదావరి లో వరదలు వచ్చేలోపు టర్మినల్ ఎగువ భాగంలోని స్ట్రక్చర్ నంబర్లు 5 నుంచి 10 వరకు ఉన్న పెండింగ్ పనులను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. మే నెలాఖరు లోగా అసంపూర్తిగా ఉన్న అన్ని స్ట్రక్చర్ల పనులను పూర్తి చేయాలని, వర్షాకాలానికి ముందే టన్నెల్ ఎగువ భాగంలో ఉన్న ఆరు స్ట్రక్చర్ల నిర్మాణాన్ని అందుబాటులోకి తీసురావాలని సూచించారు.

**1.46 లక్షల ఎకరాలకు సాగునీరు...**

సత్తుపల్లి ట్రంక్ కాలువ ద్వారా సుమారు 43 కిలోమీటర్ల పొడవున 1.46 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరు అందించే లక్ష్యంతో ప్రభుత్వం పనులు చేపట్టిందన్నారు. మొత్తం రూ.700 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన పనుల్లో ఇప్పటివరకు సుమారు రూ.600 కోట్ల విలువైన పనులు పూర్తయ్యాయని తెలిపారు.

**టెండర్లు పిలిచాం...**

సీతారామ ప్రాజెక్టుకు సంబంధించిన డిస్ట్రిబ్యూటరీ కాలువల నిర్మాణానికి ఇప్పటికే అన్ని నియోజకవర్గాల్లో టెండర్లు పిలిచినట్లు తెలిపారు. జిల్లా యంత్రాంగం సమన్వయంతో భూసేకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అందరి కృషి చేస్తే వేగంగాప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కృషి చేస్తేనే ప్రాజెక్టును నిర్దేశిత కాలంలో పూర్తి చేసి ఉభయ జిల్లాలను సస్యశ్యామలంగా మార్చగలమని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఏసీపీ వసుంధర యాదవ్, రాష్ట్ర నాయకుడు డా. మట్టా దయానంద్, మార్కెట్ కమిటీ చైర్మన్లు ఆనంద్, నీరజ చౌదరి, సత్తుపల్లి, కల్లూరు పుర చైర్మన్లు రిహాన కమల్ పాషా, దారావత్ మోహన్, వైస్ చైర్మన్ బొంతు సుమలత, పసుమర్తి చందర్ రావు, చల్లగుళ్ళ నర్సింహారావు, తమ్మిన రవి, ప్రజా ప్రతినిధులు, ఉభయ జిల్లాల ఇంజనీరింగ్, ఇరిగేషన్, పోలీస్, ఫారెస్ట్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో 25బల్లల వితరణ



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మంరూరల్ మండలంలోని ఆరెంపుల గ్రామంలో గల ఎంపీపీఎస్ పాఠశాలకు చాంబర్ ఆఫ్‌కామర్స్,రచ్చబండ సభ్యుల ఆధ్వర్యంలో సర్పంచ్ బండి సతీష్ సహకారంతో 25బల్లాలను బుధవారం అందజేశారు. వీటిని ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇంచార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి చేతుల మీదుగా వితరణ ఇప్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడీఓ శ్రీదేవి, ఉప సర్పంచ్ షేక్ దావూద్, జిల్లా పరిషత్ పాఠశాల హెడ్‌మాస్టర్ సత్యనారాయణ, ఎంపీపీఎస్ హెచ్ఎం నాగులమీరా, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు కురువెళ్ల ప్రవీన్, గోదేశి రమేష్, జివిమాల్ ఉమా, కాంగ్రెస్ నాయకులు తోట వీరభద్రం, చింతమళ్ల రవికుమార్, నాగండ్ల శ్రీను, బండి వెంకటేశ్వర్లు, పప్పుల రమణ, బండి రవి, మోత్కూరి కృష్ణ, కొండపర్తి రాధాకృష్ణ, ఆంగోత్‌పల్లి లక్ష్మి నారాయణ, చుంచు జానకిరాములు, బొడ్డు జితేందర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టిసి కార్మికుల సమస్యలు పరిష్కరించాలి : బాగం

### -సమ్మెకు సిపిఐ ప్రజా సంఘాల సంపూర్ణ మద్దతు

**ప్రజాపక్షం/ ఖమ్మం :** రాష్ట్ర ప్రభుత్వం తక్షణం స్పందించి ఆర్టిసి కార్మికుల డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చమని ఆర్టిసి కార్మికులు కోరుతున్నారని ఆయన తెలిపారు. ఆర్టిసి సమ్మెను పురస్కరించుకుని సిపిఐ, ఏఐటియుసి, ప్రజా సంఘాల కార్యకర్తలు బుధవారం అర్ధరాత్రి నుంచి ఖమ్మం డిపో వద్దకు చేరుకుని ఆందోళన చేపట్టారు. బస్సుల రాకపోకలను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా హేమంతరావు మాట్లాడుతూ 2019లో 52 రోజులు సమ్మె జరిగినప్పుడు సమ్మెకు కాంగ్రెస్ సంపూర్ణ మద్దతు ఇచ్చిందని అప్పుడు ఏ సమస్యల పరిష్కారం కోసం కార్మికులు సమ్మె చేశారో ఇప్పుడు అదే సమస్యల పరిష్కారానికి సమ్మె చేస్తున్నప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని ఆయన ప్రశ్నించారు. ఆర్టిసిని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియను మేము అధికారంలోకి రాగానే చేపడతామని చెప్పిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇప్పుడు ఎందుకు పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తుందని హేమంతరావు ప్రశ్నించారు. ఆర్టిసి కార్మికులది గొంతెమ్మ కోర్కెలు కావని ప్రభుత్వం మహాలక్ష్మి పథకం పేరుతో ఇంత ప్రజాదరణ పొందుతుందంటే దాని వెనక కార్మికుల కష్టం ఉందన్నారు. పిఆర్‌సి అమలు కోసం 50 రోజుల క్రితమే సమ్మె నోటీసు ఇచ్చినా ఈ ప్రభుత్వం కనీసం స్పందించ లేదని ఇప్పుడు మరో నాలుగు వారాల సమయం కోరడ మంటే కార్మికులను వంచించడమేనన్నారు. ఆర్టిసి కార్మికుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం జరిగేంత వరకు సమ్మె కొనసాగుతుందని సమ్మెకు సిపిఐ సంపూర్ణ మద్దతు ప్రకటించి ఆందోళనలో పాల్గొంటుందని ఆయన తెలిపారు. ప్రభుత్వం తక్షణం ఆర్టిసి జేఏసిని చర్చలకు పిలవాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వంలో విలీనం, పిఆర్‌సి అమలు, వేతన సవరణ తదితర అంశాలను పరిష్కరించాలని హేమంతరావు కోరారు. ఆందోళన కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పోటు కళావతి, తోట రామాంజనేయులు, ఏఐటియుసి నాయకులు పిల్లి రమేష్, గాదె లక్ష్మినారాయణ, పి. మోహన్‌రావు, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు బేడీలు వేసిన మీరా..

# రైతుల గురించి మాట్లాడేది..?

**(మొదటిపేజీ తరువాయి)**



రూ.500 బోనస్ ను ఇవ్వటంతో పాటు, 25 లక్షల మంది రైతులకు రూ.21 వేల కోట్ల ను రుణమాఫీ ని అందించినట్లు తెలిపారు. గతంలో రైతు బంధు కు రూ.10 వేలు ఇస్తే, ప్రస్తుతం రూ.12 వేలను అందిస్తున్నట్లు తెలిపారు. రైతు పక్షపాతి ప్రభుత్వం అన్నారు. ఇంకా మరో నాలుగు ఎన్నికలు జరిగినా ప్రజలు కాంగ్రెస్ ను దీవిస్తారని అన్నారు. రైతులకు పెద్దపీట వేసినట్లు తెలిపారు. ఆర్థిక పరిస్థితులలో అనుకూలించకపోయినా, ప్రభుత్వం ఇచ్చిన మాట ను నిలబెట్టుకుంటున్నట్లు తెలిపారు. రైతులు పండించిన పంట ను నిల్వచేసుకునేందుకు వీలుగా 200 శాతం పెంచేలా కార్యాచరణ ను రూపొందించినట్లు తెలిపారు. ప్రవేట్ రంగం కు దీటుగా ప్రభుత్వం ఆధ్వర్యంలో కోల్డ్ స్టోరేజీలను నిర్మించి త్వరలోనే అందుబాటులోకి తీసుకొస్తామని అన్నారు. ఉచిత విద్యుత్, రేషన్ కార్డులు, బస్సు ప్రయాణం లాంటి అనేక సంక్షేమ పథకాలను అప్పుల భారం ఉన్నప్పటికీ చిత్తశుద్ధి తో అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. రైతును రాజు చేయటమే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. రైతుల గురించి గత పాలకులకు మాట్లాడే అర్హత లేదన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర ఇరిగేషన్ అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వా విజయ్ బాబు, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, స్థానిక నాయకులు కొండాలి గోవిందరావు, శాఖమూరి రమేష్, బచ్చలకూరి నాగరాజు, జెర్రిపోతుల అంజిని, నంబూరి రామారావు, వేగినాటి లక్ష్మినర్సయ్య, కర్ల ఆశోక్, పాకనాటి కన్నారెడ్డి, చెరుకుపల్లి రాజేష్, కొమ్మినేని విజయా బాబు, కడియాల నరేష్,రాయపూడి రోహిత్, వివిధ పంచాయతీల సర్పంచ్ లు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కరించాలి: దండు



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించి సమ్మెను నిరోధించి రాష్ట్రంలో ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ డిమాండ్ చేశారు. సత్తుపల్లిలో ఆర్టీసీ బస్టాండ్ లో బుధవారం ఆర్టీసీ కార్మికులు చేస్తున్న సమ్మెకు సిపిఐ పార్టీ తరపున మద్దతు ప్రకటించి సమ్మెలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు రామకృష్ణ, సిపిఐ మండల కార్యదర్శి తడికమల యోబు, సిపిఐ టౌన్ కమిటీ సభ్యులు ఎర్రజల రాజశేఖర్, ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు టి తిరుపతయ్య, రామకృష్ణ, సతీష, మల్లికార్జునరావు, వెంకటయ్య, నాగరాజు, సుధాకర్, రాంబాబు, ఆర్టీసీ కార్మికులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాల్లో రైతులు కన్నీరు



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని ఐకెపి, డిసిఎంఎస్, సొసైటీల ఆధ్వర్యంలో గత 15 రోజుల క్రితం కొనుగోలు కేంద్రాలు సుమారుగా 30 ప్రారంభించి కొనుగోలు మరిచిపోవడంతో రైతులు కొనుగోలు కేంద్రాల్లో దాన్యం ఆరబోసి ప్రభుత్వం వైపు ఆకాశం వైపు ఎదురుచూపులతో కాయలు కాసి కన్నీరు కారుస్తున్నారు. 15 రోజుల క్రితం ప్రారంభించిన కొనుగోలు కేంద్రాలు నేటికీ మిల్లులు అలాట్మెంట్ లేకపోవడం వల్ల రైతులు ఎంత కో కొంతకు దళారులకు అమ్మేస్తూ దళారుల పాలవుతూ ఉన్నారు. ఈ విధంగా ప్రైవేటు వ్యాపారులు గ్రామాలలో వ్యాపారస్తులను రైతులు ఆశ్రయిస్తూ కేవలం రూ. 1200/ల కే రైతులు అమ్మేసుకుంటూ కన్నీరు పెడుతున్నారు. మండల పరిధిలోని చిన్న కొరుకొండి ,పెద్ద కోరుకొండి, చెన్నూరు, లింగాల, ముచ్చవరం, చంద్రుపట్ల తదితర గ్రామాలలో ఇకనైనా కొనుగోలు చేస్తారని ఎదురు చూపులతో రైతులు దిగాలుగా కన్నీరుతో చూస్తున్నారు. కొంటానని చెప్పటం లేదు అసలు సమస్య ఏమిటని కూడా చెప్పకుండా ఉండటంతో రైతులు నిరుత్సాహంతో కన్నీరు పెడుతున్నారు.

# అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

**-ఓవర్ బ్రిడ్జికి మరమ్మతులు చేపట్టండి**
**-ప్రకాష్‌నగర్, చర్చికాంపౌండ్ బ్రిడ్జిలను పరిశీలించిన మంత్రి తుమ్మల**




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు సౌకర్యవంతమైన వసతులు అందుబాటులోకి తీసుకు రావాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం ఖమ్మం నగరంలోని చర్చికాంపౌండ్, ప్రకాష్‌నగర్ ఓవర్ బ్రిడ్జిలను కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్యలతో కలిసి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పరిశీలించారు. బ్రిడ్జిల ప్రస్తుత పరిస్థితి, మరమ్మతుల అవసరం, ట్రాఫిక్ సౌకర్యాలపై అధికారులకు మంత్రి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చర్చికాంపౌండ్ ఓవర్ బ్రిడ్జిపై వాహనదారులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా తక్షణమే మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. బ్రిడ్జి మధ్య భాగంలో రబ్బర్ స్ట్రిప్స్ ఏర్పాటు చేసి వాహనాల ప్రయాణాన్ని సాఫీగా మార్చాలని సూచించారు. బ్రిడ్జిపై ఉన్న గుంతలు, పగుళ్ల సమస్యను వెంటనే పరిష్కరించాలన్నారు. ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకుని భద్రతా చర్యలను మరింత బలోపేతం చేయాలన్నారు. బ్రిడ్జిపై ఉన్న పూల కుండీలలోని మొక్కలను సంరక్షించాలని సూచించారు. అవసరమైన చోట హెచ్చరిక బోర్డులు, ప్రమాదాల సూచనలు ఏర్పాటు చేసి రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. నగరాభివృద్ధిలో భాగంగా చేపడుతున్న అన్ని పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ సమయపాలనతో పూర్తి చేయాలని తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా పనులు చేపట్టాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ అధికారులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# డబుల్‌బెడ్‌రూం ఇండ్ల వద్ద వసతులు కల్పించాలి

**-సిపిఐ నాయకులు పగడాల మల్లేష్**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** డబుల్‌బెడ్‌రూం ఇండ్ల వద్ద వసతులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం వెంటనే సౌకర్యాలు కల్పించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల మల్లేష్ డిమాండ్ చేశారు. బుధవారం ఖమ్మం నగరంలోని అల్లిపురం వద్ద గల డబుల్‌బెడ్‌రూం ఇండ్లను పగడాల మల్లేష్ ఆధ్వర్యంలో 14, 15 డివిజన్ల సిపిఐ నాయకులు సందర్శించారు. అక్కడ గృహవాసులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా పగడాల మల్లేష్ మాట్లాడుతూ కొత్తగూడెం, అల్లిపురం రోడ్డు వెడల్పులో ఇండ్లు కోల్పోయిన వారికి, నగరంలోని వివిధ ప్రాంతాల వారికి అల్లిపురం డబుల్‌బెడ్‌రూంల వద్ద ఇండ్లు కేటాయించారని తెలిపారు. ఇండ్లు కేటాయించినప్పటికీ అక్కడ కనీస మౌలిక వసతులు కల్పించలేదని తెలిపారు. విద్యుత్ సౌకర్యం, త్రాగునీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. ప్రభుత్వం తాత్కాలికంగా విద్యుత్ సరఫరా ఏర్పాటు చేసినప్పటికీ ఇటీవల విద్యుత్ శాఖాధికారులు కరెంట్ కట్ చేశారని మరల కరెంట్ సరఫరా పునరుద్దరించారన్నారు. డబుల్‌బెడ్‌రూం ఇండ్ల వద్ద ప్రత్యేకంగా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాను అందించాలని డిమాండ్ చేశారు. త్రాగునీరు లేక అక్కడ గృహవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వేసవి దృష్ట్యా నీటి ఎద్దడి తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డ్రైనేజీ వ్యవస్థ కూడా సరిగ్గా లేదన్నారు. డబుల్‌బెడ్‌రూంల వద్ద రాత్రి పూట వీధి లైట్లు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వెంటనే వాటిని ఏర్పాటు చేయాలన్నారు. ప్రజలకు మౌలిక వసతులను తక్షణమే ఏర్పాటు చేయాలని లేని పక్షంలో కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు రావూరి సోందయ్య, జొన్నలగడ్డ వెంకటేశ్వర్లు, ముద్రబోయిన అప్పారావు, మాకనబోయిన నాగేశ్వరరావు, రాపోలు కొండలు, ప్రతానపు ప్రసాద్, డబుల్‌బెడ్‌రూం వాసులు వీరబాబు, భూమా వెంకటి, వట్టికొండ లక్ష్మి, జంగాల బాబు, టి. నాగేశ్వరరావు, షేక్ సహీనాబేగం తదితరులు పాల్గొన్నారు.

# తల్లాడ తహశీల్దార్ కార్యాలయం ముందు రైతుల నిరసన



**ప్రజాపక్షం/ తల్లాడ :** తల్లాడ మండలంలో వరి రైతుల సమ్యలు రోజు రోజుకు తీవ్ర రూపం దాలుస్తున్నాయి. కొనుగోలు కేంద్రాలు ప్రారంభమై వారాలు గడిచినా రైతుల ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవడంతో రైతులు ఆగ్రహంతో బుధవారం తల్లాడ తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు. ఈ నిరసన కార్యక్రమానికి భారతీయ జనతా పార్టీ నాయకులు హాజరై రైతులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు ఆపతి వెంకటరామారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. రైతులు కష్టపడి పండించిన ధాన్యాన్ని గత 20రోజులుగా కొనుగోలు కేంద్రాలకు తీసుకు వస్తున్నా ఇప్పటికీ ఒక్క గింజ కూడా కొనకపోవడం దురదృష్టకరమని అన్నారు. ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ నాయకులు కేంద్రాలు ప్రారంభించామని చెప్పడమే గాని పసుపు బస్తాలు కూడా అలాగే పడి ఉండటం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని మండిపడ్డారు. అనంతరం డిఎస్ఓతో ఫోన్‌లో మాట్లాడి తల్లాడలో నెలకొన్న పరిస్థితిని వివరించినట్లు తెలిపారు. వెంటనే కొనుగోలు ప్రారంభించి రైతులకు బస్తాలు(టిక్కీలు) సకాలంలో అందించి ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులను నట్టేట ముంచిన ఈ ప్రభుత్వం వెంటనే స్పందించి కొనుగోలు కేంద్రాలను సక్రమంగా నడపాలని, లేనిపక్షంలో బిజెపి కిసాన్‌మోర్చా రైతుల తరుపున పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో భాజపా నాయకులు గాదె కృష్ణారావు, రాయల రమేష్, పెరిక కిరణ్‌గౌడ్, చల్ల నరేష్, రైతులు బి.పుల్లారెడ్డి, వెంకటరెడ్డి, కె.కృష్ణారెడ్డి, రామారావు, చీరాల శంకర్రావు, దామవరపు బుజ్జి, బాలయ్య, చీరాల కొండ, పుల్లారెడ్డి, చల్లా రాము పాల్గొన్నారు.

# శ్రీనివాసరావు కుటుంబానికి అండగా ఉంటా

**వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్**



**ప్రజాపక్షం/కొణిజర్ల :** నామా శ్రీనివాసరావు కుటుంబానికి అండగా ఉంటానని వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ అన్నారు. మండల పరిధిలోని లాలాపురంలో ఇటీవల లైట్‌వెయిట్ బ్రిక్స్ ఫ్యాక్టరీపైనుంచి ప్రమాదవశాత్తు జారిపడి మృతిచెందిన నామా శ్రీనివాసరావు కుటుంబాన్ని బుధవారం ఎమ్మెల్యే పరామర్శించారు. శ్రీనివాసరావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులుర్పించారు. మృతుడి భార్య రాజేశ్వరి, కుమారులు సాయి, శశి లను పరామర్శించారు. వారికి ధైర్యం చెప్పారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు మృతుని కుటుంబానికి అండగా ఉంటానని ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తానని హామినిచ్చారు. కుటుంబానికి అవసరమైన సహాయాన్ని అందించేందుకు సిద్దంగా ఉన్నానని తెలిపారు. ఈకార్యక్రమంలో రాంపూడి రోశయ్య, సంక్రాంత్రి నర్సయ్య, చింతనిప్పు చలపతి, చింతనిప్పు ప్రసాద్, పాసంగులపాటి రవి, ఆనందరావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐ సీనియర్ నాయకులు లింగా మృతి



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** సిపిఐ సీనియర్ నాయకులు పంగిడి గ్రామానికి చెందిన జర్పుల లింగా (93) బుధవారం మృతిచెందారు. ఆయన మృతి పట్ల సిపిఐ నాయకులు నివాళులర్పించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల మల్లేష్, మండల కార్యదర్శి శాఖమూరి శ్రీనివాసరావు లింగా భౌతికాయాన్ని సందర్శించి పార్టీ జెండా కప్పి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దండి సురేష్ మాట్లాడుతూ రజబ్‌అలీ ముఖ్య అనుచరుడైన లింగా ఈ ప్రాంతాభివృద్ధికి ఎనలేని కృషి చేశారన్నారు. సిపిఐ పార్టీ బలోపేతానికి, ఈ ప్రాంత ప్రజల సమస్యల పరిష్కారానికి ఆయన చేసిన సేవలు మరువలేనివన్నారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటని తెలిపారు. వారి కుటుంబానికి పార్టీ ఎల్లవేళల అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవినాయక్, జామ్లా, లచ్చిరాం, లక్ష్మా, చీనా, గ్రామశాఖ కార్యదర్శి బానోత్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని ఏదులాపురానికి చెందిన ఇద్దరికి రూ.55వేల విలువగల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు మంజూరయ్యాయి. సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ చేతుల మీదుగా స్థానిక సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో గణపారపు అచ్చాలు రూ. 40వేలు, బొడ్డు పుల్లమ్మకు రూ.15వేల విలువగల చెక్కులను బుధవారం అందజేశారు. వీటిని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ సిఫారస్ మేరకు అనారోగ్య ఖర్చుల నిమిత్తం సీఎంఆర్‌ఎఫ్ నుంచి లభించాయి. ఈ కార్యక్రమంలో సిపిఐ మున్సిపాలిటీ నాయకులు వెన్నం భాస్కర్, మామిడి సుదర్శన్‌రెడ్డి, దొంతగాని వెంకన్న, కొట్టు నాగయ్య, మేళ్లచెర్వు రవి, మామిడాల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టిసి సమ్మెకు ఎఐఎస్‌ఎఫ్ మద్దతు




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** రాష్ట్ర వ్యాప్తంగా టిజిఎస్‌ఆర్టిసి కార్మికులు చేస్తున్న సమ్మెకు ఏఐఎస్‌ఎఫ్ సంపూర్ణ మద్దతు ఇస్తుందని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సమితి కార్యదర్శి ఇటికాల రామకృష్ణ తెలిపారు. బుధవారం గిరిప్రసాద్ భవన్‌లో జరిగిన ఏఐఎస్‌ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఇటికాల రామకృష్ణ పాల్గొని మాట్లాడుతూ ఆర్టిసి కార్మికులు వారి న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం సమ్మె చేస్తున్నారని కానీ రాష్ట్ర ప్రభుత్వం దానిని విచ్ఛిన్నం చేయడానికి ప్రయత్నిస్తుంది తప్ప సమస్యల పరిష్కారానికి కృషి చేయడం లేదన్నారు. ఆర్టిసిని నిర్వీర్యం చేసి దానిని ప్రైవేటీకరణకు దారితీసేవిధంగా ప్రభుత్వ చర్యలు ఉన్నాయని ఆయన ఆరోపించారు. కార్మికులను భయభ్రాంతులకు గురిచేసే పరిస్థితులను ప్రభుత్వమే సృష్టిస్తుందన్నారు. కార్మికుల ఉద్యోగ భద్రతకై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని రామకృష్ణ డిమాండ్ చేశారు. తక్షణమే ఆర్టిసి కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు మదుపల్లి లక్ష్మణ్, రాష్ట్ర సమితి సభ్యులు మాగం లోకేష్, మనోజ్, ఆకాష్, జిల్లా నాయకులు గోపి, చైతన్య, పవన్, నరేందర్, ఉమామహేష్ తదితరులు పాల్గొన్నారు.

# రామనర్సయ్యనగర్ పాఠశాలకు అవార్డు




**ప్రజాపక్షం/కొణిజర్ల :** ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి విద్యార్థి ఇంగ్లీష్‌లో చదవాలి అనే ఉద్ధేశ్యంతో జిల్లా కలెక్టర్ 2026 సంవత్సరం అక్టోబర్ 27 నుంచి జిల్లాలో ప్రారంభించారు. ప్రతిబుధవారం ప్రోగ్రెస్‌ను నమోదు చేసే విధంగా ఒక యాప్‌ను తయారు చేశారు. అందులో భాగంగా బుదవారం ఎస్ఆర్‌గార్డెన్‌లో ఇసిఆర్ సక్సెస్ మీట్ ప్రోగ్రామ్‌ను ఏర్పాటు చేశారు. ఉత్తమ పాఠశాలకింద మండల పరిదిలోని రామనర్సయ్యనగర్ ప్రాధమికోన్నత పాఠశాలను ఎంపిక చేశారు. ఈ అవార్డును జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి చేతులమీదుగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్‌కె ఖాదర్, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, సతీష్, వీరాచారి, రాణి లకు అందజేశారు. ఈ కార్యక్రమంలో రామనర్సయ్యనగర్ సర్పంచ్ ఆంగోత్ కిరణ్, ఏఏపిసి చైర్మన్ స్వన్న పాల్గొన్నారు.

# పాఠశాలల్లోనే విద్యార్థులను బాధ్యతగల పౌరులగా తయారు చేయాలి



**ప్రజాపక్షం/కొణిజర్ల :** పాఠశాలల్లో విద్యార్థులను బాధ్యతాయుతమైన పౌరులుగా తయారు చేయాలని తెలంగాణ సాహిత్య అకాడమి మాజీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ అన్నారు. మండల పరిదిలోని తనికెళ్ల జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో సాంఘీశాస్త్ర ఉపాధ్యాయుడు అనంతోజు పుల్లయ్య చారి పదవీవిరమణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్యదొరుకుతుందని అన్నారు. పుల్లయ్య చారి వృత్తిపట్ల అంకితభావంతో పనిచేశారని విద్యార్థుల చదువుపట్ల ఎప్పటికప్పుడు శ్రద్ద చూపేవాడని తెలిపారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో భోధించేవాడని పేర్కొన్నారు. 2024 నుంచి రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఉద్యోగులకు రావడంలేదని తెలిపారు. బెనిఫిట్స్ అందక ఒత్తిళ్లకు గురై ఖమ్మం జిల్లాలో ఐదుగురు ఉద్యోగులు మరణించారని ఉద్యోగులే చెబుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కొణిజర్ల ఎంఈఓ అబ్రహాం, టీఎన్‌జీఓ నేత కూరపాటి రంగరాజు, ఉపాధ్యాయసంఘాల నేతలు ములక సురేష్, పిఆర్టీయు జిల్లా అధ్యక్షుడు కట్టా శేఖర్, పిఆర్టీయు జిల్లా మాజీ అధ్యక్షుడు ఎన్ కృష్ణమోహన్, ఎస్టీయు జిల్లా కార్యదర్శి షేక్ కరామత్‌ఆలీ, వై వెంకటేశ్వర్లు, జివి సూర్యం, రిటైర్డ్ ఎంఈఓ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## దీర్ఘకాలిక ప్రజాయుద్ధ పంథానే విముక్తి మార్గం

**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** లెనిన్ జయంతి, సిపిఐ ఎంఎల్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆళ్లపల్లి, మర్కోడు సెంటర్లలో జరిగిన కార్యక్రమాల్లో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఆవునూరి మధు పాల్గొని, ప్రజల విముక్తికి దీర్ఘకాలిక ప్రజాయుద్ధమే మార్గమని పేర్కొన్నారు. 1969 ఏప్రిల్ 22న పార్టీ స్థాపన, భూసాధన పోరాటాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై విమర్శలు చేశారు. ఈసందర్భంగా కొమరం సత్యనారాయణ, ఈశ్వరోజు బుచ్చిరాజం, వీరాచారి, పాయం సత్యం, పాయం రాంబాబు, కొమరం జనార్ధన్, పూసం రాంబాబు న్యూడెమోక్రసీలో చేరగా, మండల కార్యదర్శి బట్టు ప్రసాద్ కండువాలు కప్పి ఆహ్వానించారు. మర్కోడులో కొమరం సత్యనారాయణ, ఆళ్లపల్లిలో మెస్సు గోపాల్ జెండాలు ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో కొక్కు సారంగపాణి, జరుపుల కిషన్, అటికం శేఖర్, బొర్ర వెంకన్న, పూణెం లక్ష్మణ్, పూణెం మంగ, పెండకట్ల ముత్తక్క, వాగబోయిన రాంబాబు, మెస్సు రంగన్న, సురేష్, బతకయ్య, పూణెం సత్యం, పాల్గొన్నారు.

## ఘనంగా సిపిఐ ఎంఎల్ 57 ఆవిర్భవ దినోత్సవం

### లెనిన్ జయంతి..



**ప్రజాపక్ష/జూలూరుపాడు:** సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ఆధ్వర్యంలో లెనిన్146 జయంతి, సిపిఐ ఎంఎల్ 57వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ మండల కార్యదర్శి బానోతు ధర్మ ఈ సందర్భంగా మాట్లాడుతూ భారతదేశ విముక్తి కోసం, మార్క్సిజం, లేలినిజం, మావో ఆలోచన విధాన వెలుగులో భూమి కోసం, భుక్తి కోసం, ఈ దేశ విముక్తి కోసం ఎంతోమంది అమరవీరులు తమ అమూల్యమైనటువంటి ప్రాణాలు ఎర్రజెండా కోసం అర్పించారని, వారి త్యాగాలను సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ఆధ్వర్యంలో ముందుకు తీసుకుపోతామని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు రాయల సీదు, జాటోత్ నరసింహారావు, తోటకూరి నరేష్, బానోతు ధనమంతరావు, పారుపల్లి బాబు రావు, కుంచపు జమలయ్య, నరసింహారావు, ఎస్ మధు, బీ.కృష్ణ సత్యం పాల్గొన్నారు.

## మార్క్సిజం, లెనినిజం, మావో సిద్ధాంతమే విముక్తి మార్గం



**ప్రజాపక్షం/కారేపల్లి:** పాత చన్నెగలగడ్డలో లెనిన్ జయంతి, సిపిఐ(ఎంఎల్)ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా కారేపల్లి, కామేపల్లి సబ్ డివిజన్ కార్యదర్శి భూక్య శివ నాయక్ పార్టీ జెండా ఆవిష్కరించి, మార్క్సిజం, లెనినిజం, మావో ఆలోచనలతోనే ప్రజల విముక్తి సాధ్యమని పేర్కొన్నారు. 1969లో పార్టీ ఆవిర్భావం, భూసాధన పోరాటాలు, ప్రస్తుత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపై విమర్శలు చేశారు. ఈకార్యక్రమంలో సిపిఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ పార్టీ నాయకులు, ప్రజా సంఘాల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

## లెనిన్ స్ఫూర్తి నేటికీ మార్గదర్శకం

**-అశ్వాపురంలో ఘనంగా లెనిన్ 156వ జయంతి వేడుకలు**

**-సిపిఐ మండల కార్యదర్శి అనంతనేని సురేష్**



**ప్రజాపక్షం/అశ్వాపురం:** లెనిన్ స్ఫూర్తి నేటికీ మార్గదర్శకమని సిపిఐ మండల కార్యదర్శి అనంతనేని సురేష్ అన్నారు. బుధవారం అశ్వాపురం మండలం సిపిఐ కార్యాలయంలో రష్యా విప్లవకారుడు కామ్రేడ్ లెనిన్ 156వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరై లెనిన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా లెనిన్ చేసిన పోరాటం ప్రపంచానికి మార్గదర్శకమని అన్నారు. 1917అక్టోబర్ విప్లవం ద్వారా నిరంకుశ పాలనను కూలదోసి, శాంతి, సమానత్వాల కోసం పోరాట బాట చూపించారని పేర్కొన్నారు. భారత జాతీయోద్యమ నాయకులపై కూడా లెనిన్ ప్రభావం ఉందని తెలిపారు. ఈకార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి సభ్యులు ఈనపల్లి పవన్ సాయి, జిల్లా ఉపాధ్యక్షులు అక్కనపల్లి నాగేంద్రబాబు, సిపిఐ మండల నాయకులు నారాయణ, రామ్మూర్తి, రఘు, రాము, మహిళా నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## తల్లీబిడ్డల ఆరోగ్యమే దేశ భవిష్యత్తుకు పునాది



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** తల్లీబిడ్డల ఆరోగ్యమే దేశ భవిష్యత్తుకు పునాదిగా నిలుస్తుందని తుంగారం సర్పంచ్ ప్రవీణ్ ప్రకాష్ అన్నారు. బుధవారం తుంగారం గ్రామ పంచాయితీలోని అంగన్వాడీ కేంద్రంలో పోషణ పక్వాడతో పాటు శ్రీమంతం కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమానికి సర్పంచ్ ప్రవీణ్ ప్రకాష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణీలు, చిన్నారులకు సరైన పోషకాహారం అందించడం అత్యంత కీలకమని అన్నారు. అంగన్వాడీ టీచర్లు, ఆయాల సేవలను ఆయన అభినందించారరు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రమేష్, 3వ వార్డు సభ్యులు కిరణ్, గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొని గర్భిణీలకు శ్రీమంతం నిర్వహించి ఆశీర్వదించారు.

# మిల్లులు కొనుగోళ్లు లేవు



**-కూసుమంచిలో 26వేల ఎకరాల వరి గాల్లోనే..?**

**ప్రజాపక్షం/కూసుమంచి:** మండలంలో వరి రైతులు పరిస్థితి రోజురోజుకూ విషమంగా మారుతోంది. మండలంలోని నాయకన్‌గూడెంలో కొనుగోలు కేంద్రం ప్రారంభించి 15 రోజులు గడిచినా, మిల్లుల అలాట్మెంట్ స్పష్టత లేకపోవడంతో ధాన్యం కొనుగోళ్లు పూర్తిగా నిలిచిపోయాయి. ఫలితంగా వందలాది మంది రైతులు తీవ్ర ఆవేదనలో మగ్గుతున్నారు. మండల వ్యాప్తంగా సుమారు 26,000 ఎకరాల్లో వరి సాగు జరిగి, భారీగా దిగుబడులు వచ్చినా, ఆ ధాన్యం కొనేవారు లేక గోదాముల వద్ద పేరుకుపోయి ఉంది. రైతులు రోజూ కొనుగోలు కేంద్రాల వద్ద క్యూలో నిలబడి ఎదురు చూస్తున్నా, అధికారుల నుండి స్పష్టమైన సమాధానం లేకపోవడం ఆగ్రహానికి దారి తీస్తోంది. ఇదే సమయంలో అకాల వర్షాలు కురుస్తుండటంతో బహిరంగ ప్రదేశాల్లో ఉన్న ధాన్యం తడిసి పాడవుతుందనే భయం రైతులను వెంటాడుతోంది. ఇప్పటికే కొంత మేర నష్టం జరిగినట్లు రైతులు చెబుతున్నారు. పండించిన పంట కాపాడుకోవాలా లేక అప్పులు తీర్చుకోవాలా అనే ఆందోళనలో రైతులు కూరుకుపోయారు. మిల్లులు అలాట్మెంట్‌లో ఆలస్యం, కొనుగోలు ప్రక్రియలో నిర్లక్ష్యం ఇవి అన్నీ కలిసి రైతులను నష్టాల బాట పట్టిస్తున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం ప్రకటనలకే పరిమితమై, భూమిపై పరిస్థితిని పట్టించుకోవడం లేదని రైతులు మండిపడుతున్నారు. మా కష్టం మట్టిలో కలిసిపోతోంది, మాకు న్యాయం ఎప్పుడు...?అంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి మిల్లుల అలాట్మెంట్ పూర్తి చేసి కొనుగోళ్లు ప్రారంభించకపోతే, కూసుమంచిలో రైతుల పరిస్థితి మరింత దయనీయంగా మారే ప్రమాదం ఉందని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

## నాణ్యతలో రాజీ లేదు..గడువులోపే సాగునీరందాలి

**-సీతారామ ప్రాజెక్ట్‌పై మంత్రి తుమ్మల స్పష్ట ఆదేశాలు**



**ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారంగా భావిస్తున్న సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ పనులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించినట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. అన్నపురెడ్డిపల్లి మండలం తొట్టిపంపు గ్రామంలో జరుగుతున్న కాలువ పనులను అశ్వారావుపేట ఎంఎల్ఏ జారే ఆదినారాయణతో కలిసి ప్రత్యక్షంగా పరిశీలించి, పనుల పురోగతిపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ ప్రాజెక్ట్ పూర్తైతే ప్రాంతంలోని వేలాది ఎకరాలకు సాగునీరు అంది, రైతులకు దీర్ఘకాలిక లాభం చేకూరుతుందని తెలిపారు. గడువు కాలంలోపే పనులను పూర్తి చేసి నీటిని విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్ట ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడవద్దని హెచ్చరించారు. పనులు ఆలస్యం కాకుండా కాంట్రాక్టర్లు సమన్వయంతో వేగంగా పూర్తి చేయాలని సూచిస్తూ, అవసరమైన నిధులు సమకూర్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. తొట్టిపంపు నుండి వెంకటాపురం మీదుగా యాతాలకుంట టన్నెల్ వరకు పనులను పరిశీలిస్తూ సాంకేతిక అంశాలపై అధికారులతో చర్చించారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ అంకిత్, ఇరిగేషన్ సీఈ శ్రీనివాస్‌రెడ్డి, ఈఈ కృష్ణ, డీఈ కృష్ణ శంకర్, డీఈ చంద్రశేఖర్, ఏఈ రంజిత్, తహసీల్దార్ స్వర్ణ, గిర్దావర్ వెంకటేశ్వరరావు, విద్యుత్ శాఖ ఏఈ తరుణ్ సాయి, లైన్మెన్ సంజీవ్‌తో పాటు మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

## స్తంభించిన ఆర్టిసి చక్రం

**డిపోవద్ద తీవ్ర ఉద్రిక్తత**

**బస్సులు అడ్డుకున్న ఆందోళన కారులు**

**పోలీసుల మోహరింపు, అరెస్టు**

**సమ్మెను అణిచివేయాలని చూడటం దుర్మార్గం**

**వెనకుడుగు వేసేదే లేదు**

**ఆర్టిసి ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్రనేత కందుల**





**ప్రజాపక్షం/ కొత్తగూడెం :** అర్ధరాత్రి నుండి ఆర్టిసి చక్రం స్తంబించింది. కార్మికుల న్యాయ పోరాటంతో కొత్తగూడెం డిపోవద్ద ఉద్రిక్త పరిస్తితులు నెలకొన్నాయి. ఆర్టిసి ఉద్యోగ, కార్మిక సంఘాల పిలుపులో భాగంగా బుధవారం తెల్లవారు ఝామున డిపోకు చేరుకున్న ఆర్టిసి ఉద్యోగులు, సంఘాలు, సిపిఐప్రజా సంఘాల నాయకులు ప్రధాన ద్వారం వద్ద బైఠాయించి బస్సులు బయటకు రాకుండా అడ్డుకున్నారు. ఈక్రమంలో ఆందోళన కారులు, పోలీసుల నడుమ వాగ్వాదం దోపులాట చోటు చేసుకుంది. పోలీసులు ఆందోళన కారులను బలవంతంగా అరెస్టు చేసి చుంచుపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆర్టిసి ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్రనేత కందుల భాస్కర్‌తో పాటు పలువురు నాయకులు మాట్లాడుతూ తమ న్యాయమైన హక్కుల కోసం శాంతియుత నిరసన తెలుపుతుంటే పోలీసులు అక్రమ అరెస్టులు చేయడంసరైంది కాదన్నారు. అరెస్టులతో ఉద్యమాలను అణిచివేయలేదని, అరెస్టు చేసినా సమ్మె కొనసాగుతుందని,వెనుకడుగు వేసేదేలేదన్నారు. కార్మిక ఐఖ్యతతోనే విజయం సాధ్యమని, ప్రతీ ఒక్కరూ సమ్మెకు సహకరించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం మొండి వైఖరి వల్లే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.ఆందోళన కార్యక్రమంలో సిపిఐ నాయకులు సలిగంటి శ్రీనివాస్, కంచర్ల జమలయ్య,గెద్దాడు నగేష్, భూక్యా శ్రీనివాస్, కే రత్నకుమారి, లక్ష్మీ నారాయణ, షాహీమ్, కైసర్, షమీమ్, నజీర్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ విద్యాలయాల్లో చేరండి



**ప్రజాపక్షం/పాల్వంచ :** నిష్ణాతులైన ఉపాద్యాయులు కలిగిన ప్రభుత్వ విద్యాలయాల్లో చేరి ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని సాంఘిక సంక్షేమ గురుకుల డిసిఓ, దమ్మపేట కళాశాల ప్రిన్సిపాల్ కే. వెంకటేశ్వర్లు అన్నారు. తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సిఓఈలు, రెగ్యులర్ జూనియర్ కాలేజీలు, వృత్తి విద్యా, సైనిక్ కళాశాలల యందు 20262027 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్ మొదటి సంవత్సరంలో ఎంపిసి, బైపిసి, ఎంఈసి, సిఈసి గ్రూపులలో అడ్మిషన్‌ల కొరకు ఈ నెల 25 తేదీలోపు ఆన్‌లైన్ ద్వారా ధరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనంతరం ఎంట్రన్స్ పరీక్ష మే నెల 15వ, తేదీన జరుగుతుందని తెలిపారు. ఈ మేరకు అశ్వారావుపేట వివిధ సెంటర్లలో కరపత్రాలు పంచిపెట్టారు. ప్లెక్సీల రూపంలో బుధవారం జోరుగా ప్రచారం చేశారు. ఈ అవకాశాన్ని పదవ తరగతి పరీక్షలు రాసిన అన్ని కులాలకు చెందిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు అద్యాపకులు పాల్గొన్నారు.



## ఆర్టీసీ కార్మికుల సమ్మె



# తొలిరోజు విజయవంతం

**డిపోలకే పరిమితమైన బస్సులు**

**మొదటి సర్వీసు నుండే ఆగిపోయిన ప్రజా రవాణా**

**అరకొర అద్దె బస్సులు తిప్పుతున్న సంస్థ**

**పురుషులకు కూడా ఫ్రీ టిక్కెట్**

**సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యమం ఆగదు : కార్మిక నేతలు**

**ప్రజాపక్షం/కొత్తగూడెం :** ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారానికై ఆర్టీసీ జేఏసి కార్మికులు చేపట్టిన సమ్మె జిల్లాలో తొలి రోజు విజయవంతమైంది. మొదట సర్వీసు నుండే బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. జాయింట్ యాక్షన్ కమిటీగా ఏర్పడిన కార్మికసంఘాలు విధులను బహిష్కరించాయి. మూడు డిపోల పరిధిలో 286 బస్సులు ఉండగా, 929 మంది కార్మికులు ప్రతి నిత్యం విధులు నిర్వహిస్తుంటారు. జిల్లాలోని కొత్తగూడెం, భద్రాచలం, ఇల్లెందు, మణుగూరు డిపోల నుండి అద్దె బస్సులను అవుట్సోర్సింగ్ డ్రైవర్లు, కండక్టర్లతో ఆయా డిపోలకు చెందిన మేనేజర్లు తిప్పుతున్నారు. జిల్లా వ్యాప్తంగా కేవలం 10 నుండి 12 అద్దె బస్సులు మాత్రమే తిరుగుతున్నాయి. విధులు నిర్వహించేందుకు సిబ్బంది సరిగా లేకపోవడంతో ప్రయాణికుల సౌకర్యార్థం అద్దె బస్సులను తిప్పుతున్న డిపో మేనేజర్లు పరుషులకు కూడా టిక్కెట్లు తీసుకోవడం లేదు. పెండింగ్ సమస్యలను పరిష్కరించేంత వరకు ఈ ఉద్యమం ఆగదని, జీవితాలు పణంగాపెట్టి విధులు నిర్వహిస్తుంటే కనీసం పాలకులకు కనికరం లేకుండా వ్యవహరిస్తున్నారని, గతప్రభుత్వంలో భంగపడ్డ తాము ఈ ప్రభుత్వంలో కూడా అవే తిప్పలు పడుతున్నామని, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నిలుపుకోవాలని, కార్మికుల జీవితాలతో ఆటలాడుకోవడం మానుకోవాలని కార్మిక నేతలు డిమాండ్ చేస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీస్ బందో బస్తు నిర్వహించారు. జిల్లా కేంద్రంలో సమ్మెకు మద్దతు తెలుపుతున్న సిపిఐ అనుబంధ ఏఐటియూసి నేతలను పోలీసులు అదుపులోనికి తీసుకుని చుంచుపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. బస్సుల రాకపోకలు సరిగా లేకపోవడంతో బస్టాండ్ ఆవరణ అంతా ప్రయాణికులతో నిండిపోయింది. పలురాజకీయపార్టీలు, అనుబంధ కార్మిక సంఘాల నాయకులు బస్టాండ్ ఆవరణకు చేరుకుని సమ్మెకు సంఘీభావం ప్రకటించి, సంపూర్ణ మద్దతు ప్రకటించారు.

**భద్రాచలంలో :** జేఏసి ఆధ్వర్యంలో భద్రాచలం డిపో పరిధిలో తెల్లవారుఝాము 3 గం.ల మొదటి సర్వీసు నుండే బస్సులు నిలుపుదల చేశారు. అన్ని సంఘాల కార్మికులు సమ్మెలో ఉండటంతో బస్సులు తిప్పేవారు లేరు. దీంతో జేఏసిసంఘాల నేతలు, కార్మికులు డిపో ఆవరణలో గుంపులు గుంపులుగా నిలిచారు. ఈ సందర్భంగా ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి, జేఏసి రాష్ట్ర నాయకులు జివిస్ నారాయణ, ఎంప్లాయిస్ యూనియన్ డిపో కార్యదర్శి బర్ల రమణా రావులు మాట్లాడారు. కార్మికుల జీవితాలతో పాలకులు ఆటలాడుతున్నారని





ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రభుత్వంలో విలీనం చేస్తామని హామీ ఇచ్చి నేటికి కూడా అమలు చేయలేదని మండిపడ్డారు. ప్రభుత్వప్రతిష్టను కాపాడేందుకు మహా లక్ష్మి పథకాన్ని తమ భుజస్కంధాలపై వేసుకుని ముందుకు తీసుకుళెతున్నామని, ఈ సందర్భంగా డ్రైవర్లు , కండెక్టర్లు హింసకు గురవుతున్నా తట్టుకుని ముందుకు పోతున్నారని తెలిపారు. ట్రేడ్ యూనియన్లపై ఆంక్షలను ఎత్తివేయాలి. గుర్తింపుసంఘం ఎన్నికలు నిర్వహించాలి. పనిభారం తగ్గించాలి. కెఎంపిఎల్, ఇపికే వేదింపులు మానుకోవాలి. ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వమే కొని సంస్థకు ఇవ్వాలి. అద్దె బస్సులను అద్దె బస్సు డ్రైవర్లను అర్టిసిలో విలీనం చేయాలి. గ్రేటర్ హైదరాబాద్ జోన్‌లో పని చేస్తున్న కార్మికులను కరీంనగర్, హైదరాబాద్ జోన్లకు బలవంతంగా బదిలీ చేయరాదు. 2019 సమ్మె కాలంలో నమోదైన పోలీస్ కేసులను ఎత్తివేయాలి, మహిళా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలి. రద్దీకి అనుగుణంగా బస్సుల సంఖ్యను పెంచాలి. ఖాళీలు భర్తీ చేయాలి. పదవీవిరమణ పొందిన ఉద్యోగుల బకాయిలు చెల్లించాలి. దీర్ఘ కాలిక పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలు పరిష్కారమయ్యేంత వరకు సమ్మెను విరమించేదే లేదన్నారు. ఇదిలా ఉండగా తిరుగుతున్న బస్సుల్లో పురుషులకు కూడా టిక్కెట్లు తీసుకోక పోవడంతో అదేదో బాగుందంటా పలువురు పరుషులు చలోక్తులు విసురుతున్నారు. అద్దె బస్సుల్లో భద్రాచలం డిపో మేనేజర్ జంగయ్య దగ్గరుండీ మరీ ప్రయాణికులను బస్సులు ఎక్కిస్తున్నారు.

### ఇబ్బంది పడుతున్నాం



బస్సులు బంద్ అవడంతో ఇబ్బంది పడుతున్నాం, బట్టలు కొనుగోలు చేసేందుకు భద్రాచలం వచ్చి రాత్రి మా సోదరి ఇంట్లో బస చేశాం. ఉదయ్యాన్నే లేచి వెళదామని బస్టాండ్‌కు వస్తే బస్సులు బంద్ అంటున్నారు. బస్సులు తిరగకుంటే ఇంటికి చేరేది ఎట్లా.

**– సుభద్ర, ప్రయాణికురాలు**

### ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చూస్తున్నాం



సమ్మె కారణంగా ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చూస్తున్నాం, ఆర్టిసి అద్దె బస్సులను తిప్పుతున్నాం. ప్రయాణికులను వారి గమ్య స్థానాలకు చేర్చడం మా బాధ్యత, ఆ దిశగా ముందుకు సాగుతున్నాం.

**– డిపో మేనేజర్, జంగయ్య**

# సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెకు సైతం సిద్ధం

**ప్రజాపక్షం /కొత్తగూడెం :** కొత్తగూడెం ప్రభుత్వ రంగ సంస్థ సింగరేణిలో పనిచేస్తున్న కార్మికులకు సంబంధించి పెండింగ్ సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె చేస్తామని గుర్తింపు సంఘం ఎఐటియూసి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య, కొరిమి రాజ్‌కుమార్‌లు పేర్కొన్నారు. బుధవారం కొత్తగూడెం శేషగిరిభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చాలాకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని, లేనిపక్షంలో అన్ని కార్మిక సంఘాలను కలుపుకొని సమ్మె చేస్తామి యాజమాన్యాన్ని హెచ్చరించారు. కారుణ్య ఉద్యోగాలపై ఏసీబీ విచారణ నిలిపివేయాలని డిమాండ్ చేశారు. సంస్థలో మెడికల్ వ్యాలిడేషన్ కోసం ఎదురు చేస్తున్న కార్మికులు అధికసంఖ్యలో ఉన్నారని పెండింగ్‌లో ఉంచిన మెడికల్ బోర్డును వెంటనే ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి చెల్లించాల్సిన పెండింగ్ బకాయిలు రూ.50 వేల కోట్లను వెంటనే చెల్లించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వటిని చెల్లించకుండా కావాలని సింగరేణి సంస్థను నష్టాల్లోకి తీసుకెళ్లి సింగరేణి సంస్థను సర్వనాశనం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో యూనియన డిప్యూటీ ప్రధాన కార్యదర్శిలు కే.వీరభద్రయ్య, ముస్కే సమ్మయ్య, వై.వి.రావు, కేంద్ర కార్యదర్శి వంగ వెంకట్, బ్రాంచ్ సహాయ కార్యదర్శి గట్టయ్య, వైస్ ప్రెసిడెంట్ క్రిస్టోఫర సందబోయిన శ్రీనివాస్, గోపి, హుమాయూన్, నితిన్ గంగారం, మండల రాజేశ్వరరావు, లక్ష్మి నారాయణ, సోమయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.




## ఉత్తమ పనితీరుకు గుర్తింపుగా నజరానా

### -కూలీలకు పని కల్పనలో ముందంజలో అంజనాపురం ఫీల్డ్ అసిస్టెంట్



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** బూర్గంపాడు మండలంలో ఉపాధి హామీ పథకం అమలులో ప్రతిభ కనబరిచిన క్షేత్రస్థాయి సిబ్బందిని రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. గ్రామాల్లో కూలీలకు అధిక సంఖ్యలో పని కల్పిస్తూ, నిబంధనలకు అనుగుణంగా హాజరు నమోదు నిర్వహించిన సిబ్బందికి నజరానా ప్రకటించడం ద్వారా పనితీరును మెరుగుపచ్చే దిశగా చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలో అంజనాపురం ఫీల్డ్ అసిస్టెంట్ కణితి రామకృష్ణ ఉత్తమ సేవలకు గుర్తింపుగా నిలిచారు. ఆయన కృషిని ప్రశంసిస్తూ అడిషనర్ డీఆర్‌డీఓ రవి కుమార్ బుధవారం రూ 1000 నజరానా అందజేశారు. ఈకార్యక్రమం ఉపాధి సిబ్బందితో మరింత ఉత్సాహాన్ని నింపడంతో పాటు, గ్రామీణ ఉపాధి అవకాశాలను విస్తరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందనే సందేశాన్ని స్పష్టం చేస్తోంది. ఈకార్యక్రమంలో డీఎల్‌పీవో సుధీర్, ఏపీడీ రమణ, డీఆర్‌పీ శ్రీలత, సుభాసిని, హెచ్‌ఆర్ మేనేజర్ రత్నకుమార్, సిబ్బంది రాజారత్నం, తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాల లేమితో రైతుల ఇబ్బందులు



**ప్రజాపక్షం/కారేపల్లి:** కారేపల్లి మండలం మాదారం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు కొండెబోయిన నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కే నరేంద్ర, రైతు సంఘం నాయకులు సందర్శించి, రైతుల సమస్యలను తెలుసుకున్నారు. మండలంలో 10వేల ఎకరాల్లో సాగు ఉన్నప్పటికీ ఒక్క కేంద్రం మాత్రమే ఉండటంతో రేలకాయలపల్లి, చీమలపాడు, తొడితలగూడెం, పోలంపల్లి, కమలాపురం రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. హమాలీ, లారీ, గోదాం ఖర్చులు రైతులపై భారం అవుతున్నాయని, హమాలీ ఖర్చులు ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. వైరా ఎంఎల్‌ఏ రాందాస్ నాయక్‌కు సమస్య వివరించగా అదనపు కేంద్రాల ఏర్పాటుకు హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో ముండ్ల ఏకాంబరం, వజ్జా రామారావు, తుమోజు రామ్మూర్తి, పాపినేని నాగేశ్వరరావు, పొట్లకాయల రమేష్, జడ నాగేశ్వరరావు, రజిని, కిలారి అప్పారావు, బానోత్ సీతారాములు, ధర్మసోత్ అశోక్, పాల్గొన్నారు.

## 14వ వేతన ఒప్పందంపై చర్చలు జరపాలి

### -28వ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్షలు




**ప్రజాపక్షం/బూర్గంపాడు:** ఐటీసీ కాంట్రాక్ట్ కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు 28వ రోజుకు చేరుకున్నాయి. ఈసందర్భంగా దీక్షలో కాంట్రాక్ట్ కార్మికులకు మద్దతుగా ఉప్పులూరి సోమరాజు, బండారు రామకృష్ణ, బత్తుల గోపాలరావు పాల్గొన్నారు. వారికి జేఏసీ కన్వీనర్ పాటి సోమిరెడ్డి, కోకన్వీనర్లు షేక్ యాకుబ్ పాషా, ఆకిని సర్వేశ్వరరావు పూలమాలలు వేసి దీక్షను ప్రారంభించారు. ఈకార్యక్రమంలో కోకన్వీనర్లు సానికొమ్ము రామచంద్రారెడ్డి, బల్లెం నాగయ్యతో పాటు పలువురు కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ 14వ వేతన ఒప్పందంపై చర్చలను కాంట్రాక్ట్ కార్మిక సంఘాల జేఏసీతో తక్షణమే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## వేసవి వేళ... రామ ‘సహాయం’..!

### 44 గ్రామాల్లో తాగునీటి కష్టాలకు ఎంపీ రఘురాం రెడ్డి చెక్



**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** వేసవిలో భానుడు భగభగ లాడుతుండటంతో జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు, ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. తన నియోజకవర్గ అభివృద్ధి నిధుల (MPLADS) నుంచి రూ.35 లక్షలు మంజూరు చేస్తూ తక్షణ చర్యలకు శ్రీకారం చుట్టారు. దప్పిక తీర్చే ఎంపీ లాడ్స్ జిల్లాలోని సత్తుపల్లి, మధిర, వైరా, పాలేరు నియోజకవర్గాలోని 44 గ్రామాల్లో రూ.35,20,000 నిధులతో కొత్తగా చేతిపంపులను ఏర్పాటు చేయించనున్నారు. ముఖ్యంగా శివారు ప్రాంతాలు, ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో నీటి సమస్య పరిష్కారానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ఎంపీ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయగా, ఇప్పటికే కొన్ని ప్రారంభమయ్యాయి. దీనివల్ల వృద్ధులు, మహిళలకు దూర ప్రాంతాల నుంచి నీళ్లు తెచ్చుకునే కష్టాలు తప్పనున్నాయి. వారం రోజుల్లోనే పనులు పూర్తి కావాలి. నిధుల అనుమతులు మంజూరైన నేపథ్యంలో పనులను పట్టాలెక్కించాలని ఎంపీ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. తాగునీటి సమస్య తీవ్రతను గుర్తించి తక్షణమే నిధులు కేటాయించినందుకు స్థానిక సర్పంచ్ లు, ప్రజలు ఎంపీ రఘురాం రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

# నాణ్యతతో రహదారుల నిర్మాణాలు చేపట్టాలి

**-మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి**
**- ముత్తగూడెంలో రూ.6.50కోట్లతో బీటీరోడ్డుకు శంకుస్థాపన**



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** నాణ్యతతో కూడిన రహదారులను నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచారశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని చింతపల్లి నుంచి ముత్తగూడెం వరకు రూ.6.50కోట్ల వ్యయంతో చేపట్టనున్న బీటీరోడ్డు పనులకు అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ...రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని, ఈ లోపే రహదారి పనులను పూర్తి చేయాలన్నారు. పనుల నాణ్యతలో ఎక్కడా రాజీ పడకూడదని స్థానిక ప్రజా ప్రతనిధులు పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. గతంలోనే ముత్తగూడెం అభివృద్ధి కోసం రూ.16.70కోట్లు మంజూరు చేశామన్నారు. అలాగే మున్సిపాలిటీ వ్యాప్తంగా మరిన్ని సీసీరోడ్డు, డ్రైన్ల పనులు చేపడతామని హామీ ఇచ్చారు. తమ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాలను సమాంతరంగా అమలు చేస్తోందని మంత్రి పేర్కొన్నారు. ఉచిత బస్సు ప్రయాణం, రైతు భరోసా, రుణమాఫీ, సన్న వడ్లకు బోనస్ వంటి పథకాలతో ప్రజలకు భరోసా కల్పిస్తున్నామని చెప్పారు. అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు అందజేస్తామని, త్వరలో రెండోవిడత పంపిణీ ప్రక్రియను ప్రారంభిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మొహ్మద్ మౌలానా, రాష్ట్ర ఇరిగేషన్ అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, మున్సిపల్ చైర్‌పర్సన్ పోకబత్తిని అనిత, కౌన్సిలర్లు కోటమర్తి సునీత, బానోత్ దివ్య, రవీందర్, పాలేరుప్రత్యేక అధికారి రమేష్, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ యాకోబు, కాంగ్రెస్ జిల్లా నాయకులు మద్ది మల్లారెడ్డి, భూక్య సురేష్‌నాయక్, తోట వీరభద్రం, మద్దులపల్లి మార్కెట్ డైరెక్టర్ తేజావత్ పంతుల్‌నాయక్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కళ్లెం వెంకట్‌రెడ్డి, నాయకులు గోనే భుజంగరెడ్డి, ఆరెంపుల రామయ్య, వెంపటి సురేష్, ఉత్తమ రైతు అవార్డు గ్రహీత అనుముల రాంరెడ్డి, పిఎస్‌ఆర్ సోషల్‌మీడియా వారియర్ ఆరెంపుల బద్రిసాయి తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల డిమాండ్లు వెంటనే అమలు చేయాలి

**ప్రజాపక్షం/సత్తుపల్లిః** రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ఆర్టీసీ కార్మికుల సమ్మెకు రాజకీయ పార్టీల మద్దతు పెరుగుతోంది. బుధవారం సత్తుపల్లి డిపోలో జరుగుతున్న సమ్మెకు బీఆర్‌ఎస్, బీజేపీ, సిపిఐ అనుబంధ సంఘం ఏఐటియూసి నాయకులు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. సత్తుపల్లి ఆర్టీసీ డిపో వద్ద సమ్మె నిర్వహిస్తున్న కార్మికులను ఆయా పార్టీల నాయకులు కలిసి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ మాజీ చైర్మన్ కూసంపూడి మహేష్ మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమ్మె నోటీసు ఇచ్చి 42 రోజులు గడిచినా ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. కార్మికుల హక్కులను పరిరక్షించాల్సిన ప్రభుత్వం వాటిని కాలరాసేలా వ్యవహరించడం తగదని విమర్శించారు. ఇక మరోవైపు, సత్తుపల్లి పట్టణ బీజేపీ శాఖ ఆధ్వర్యంలో కూడా ఆర్టీసీ కార్మికుల సమ్మెకు మద్దతు ప్రకటించారు. పట్టణ అధ్యక్షుడు బానోతు విజయ్ నాయకత్వంలో పార్టీ నాయకులు డిపో ఎదుట నిరసనలో పాల్గొన్నారు. జిల్లా కార్యదర్శి పాల నాగాసురేందర్ రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు ఆచంట నాగస్వామి మాట్లాడుతూ గతంలో 54 రోజుల పాటు జరిగిన సమ్మె అనంతరం ఇచ్చిన హామీలు



ఇప్పటికీ అమలు కాలేదని ఆరోపించారు. 2017 బకాయిల చెల్లింపు, 2021 మరియు 2025 పే స్కేల్ అమలు, ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయడం వంటి కార్మికుల డిమాండ్లు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయని పేర్కొన్నారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లు నెరవేరే వరకు సమ్మె కొనసాగించాలని, తమ పార్టీ కార్మికుల పక్షాన పోరాటానికి సిద్ధంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తూరు ఉమామహేశ్వరరావు, చాంద్ పాషా, మల్లూరు అంకంరాజు, వల్లభనేని పవన్, నరుకుళ్ల శ్రీను, చంటి, పూజల రవి, వెంకటేశ్వరరావు, గాదె సురేష్ తదితరులు ఉన్నారు.బిజేపి పట్టణ ప్రధాన కార్యదర్శి మందా శివ, సీనియర్ నాయకులు చీకటి వసంతరావు, పెద్దిరాజు, బట్టి, శివ, సాయి యాదవ్ పాల్గొన్నారు.

# మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం



**ప్రజాపక్షం/ మధిర :** మధిర మండల పరిధిలోని సిద్ధినేనిగూడెంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నర్సింహారావు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం మద్దతు ధర కల్పించి కొనుగోలు చేస్తుందని, ఎవరూ కూడా దళారులకు అమ్ముకుని నష్టపోవద్దని సూచించారు. రైతుల సౌకర్యార్థం డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క అధికారులతో మాట్లాడి మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయటం పట్ల ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి కర్నాటి రామారావు, ప్రధాన కార్యదర్శి పులిబండ్ల చిట్టిబాబు, కిసాన్ సెల్ మండల అధ్యక్షులు దుంప వెంకటేశ్వరరెడ్డి, మండల సీనియర్ కాంగ్రెస్ నాయకులు నిడమానూరు వంశీకష్ణ, ఎఎంసి డైరెక్టర్ అద్దంకి రవికుమార్, సిద్దినేనిగూడెం సర్పంచ్ వేల్పుల వెంకటరావమ్మ, సైదల్లీపురం సర్పంచ్ నెల్లూరు లక్ష్మీ , నాగవరప్పాడు సర్పంచ్ ఈశ్వరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# మొక్కజొన్నలను జాప్యం లేకుండా కొనుగోలు చేయాలి

**ప్రజాపక్షం మధిర :** రైతన్నలు ఆరుగాలం కష్టించి పండించిన మొక్కజొన్నలను ప్రభుత్వం జాప్యం లేకుండా వెంటనే కొనుగోలు చేసి వారిని ఆదుకోవాలని మాజీ జెడ్పిచైర్మన్, బిఆర్ఎస్ మధిర అసెంబ్లీ ఇన్‌చార్జి లింగాల కమల్‌రాజు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక మార్కెట్ యార్డులోని కొనుగోలు కేంద్రాన్ని ఆయనతో పాటు బిఆర్ఎస్ నాయకులు పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడతూ మార్కెట్ యార్డులో రైతులకు సంబంధించిన ధాన్యాన్ని ఆరబోసేందుకు సౌకర్యాలు లేవన్నారు. పశువులు, పందులు మార్కెట్‌యార్డ్ నందు సంచరించి పంటను నాశనం చేస్తున్నాయని అన్నారు. ఇక్కడ ప్రాతినిధ్యం వహిస్తున్న డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క రైతుల పట్ల బాధ్యతరహిత్యంగా ఉంటున్నారని, కమీషన్లు వచ్చే పనులకు మాత్రమే శ్రద్ధ వహిస్తారా అని మండిపడ్డారు. రైతు ప్రభుత్వమని చెప్పుకునే డిప్యూటీ సిఎం మొక్కజొన్నలను సకాలంలో ఎందుకు కొనుగోలు చేయడం లేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా మొక్కజొన్న రైతులను ఆదుకోవాలని, కొనుగోలు కేంద్రాల్లో జాప్యం లేకుండా ధాన్యాన్ని, మొక్కజొన్నలు సరైన



మద్దతు ధరకు కొనుగోలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు పల్లపోతు వెంకటేశ్వరరావు, అరిగె శ్రీనివాసరావు, చిత్తారు నాగేవ్వరరావు, బిక్కి కృష్ణప్రసాద్, వంకాయలపాటి నాగేశ్వరరావు, రాయపట్నం సర్పంచ్ కంచం గోపి, రాయుడు భద్రయ్య, ఆళ్ల నాగబాబు, సయ్యద్ ఇక్బాల్, మెట్టల ప్రసాద్, బానోతు రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారుల భవిష్యత్‌కు పునాదులు అంగన్వాడీ కేంద్రాలు



**ప్రజాపక్షం/ తల్లాడ :** చిన్నారుల భవిష్యత్‌కు పునాదులు అంగన్వాడీ కేంద్రాలు అని తల్లాడ మేజర్ పంచాయతీ సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు (చిన్నబ్బాయి) అన్నారు. బుధవారం స్థానిక అంగన్వాడీ కేంద్రంలో జరిగిన పోషన్ పక్వాడ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిధిగా హాజరై చిన్నారులకు, అన్నప్రసాన, అక్షరాభాస్యం కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పుట్టే పిల్లలకు జన్యుపరమైన సమస్యలు రాకుండా భవిష్యత్‌లో పిల్లలు అనారోగ్యానికి గురికాకుండా మానసికంగా దృఢంగా ఉండేందుకు గర్భిణీస్త్రీలకు అంగన్వాడీ సెంటర్ల ద్వారా బలమైన పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందిస్తున్నట్లు చెప్పారు. జీరో నుండి ఆరు సంవత్సరాల లోపు పిల్లలను అంగన్వాడీ సెంటర్లో చేర్పించాలని, తద్వారా తల్లిపాలుతోపాటు అంగన్వాడీ సెంటర్‌లో అందించే పోషక విలువలు ఉన్న ఆహారాన్ని పిల్లలకు అందించాలని కోరారు. అనంతరం అంగన్వాడీ సమస్యలపై ఆరా తీయగా సరైన బిల్డింగ్ లేక ఇబ్బందులు పడుతున్నామని తన దృషికి తీసుకురాగా బిల్డింగ్ మంజూరయ్యే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. 15రోజులు జరగనున్న పోషక పక్వాడ కార్యక్రమంపై ఎసిడిపిఓ నవ్యశ్రీ, సూపర్వైజర్ రోజా అరుణకుమారి గర్భిణీలకు, బాలింతలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కర్నాటి లక్ష్మారెడ్డి, అంగన్వాడీ టీచర్ శైలజ, బాలింతలు, గర్భిణీలు తదితరులు పాల్గొన్నారు.

# బనిగండ్లపాడుకు బెస్ట్ స్కూల్ అవార్డు



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** ఎవరీ చైల్డ్ రీడ్స్ ప్రోగ్రాంలో ఎర్రుపాలెం మండలంలోని బనిగండ్లపాడు బిసికాలనీ ప్రాథమిక పాఠశాల బెస్ట్ స్కూల్ అవార్డుకు ఎంపికై జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి చేతుల మీదుగా హెచ్‌ఎం జంగా గురునాధరెడ్డి, ఉపాధ్యాయులు చిన్నప్ప సాంబయ్య, శివ అవార్డును అందుకున్నారు. ఈసందర్భంగా హెచ్‌ఎం గురునాధరెడ్డి మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఇచ్చిన స్ఫూర్తితో మా ఉపాధ్యాయుల బృందం సహకారంతో ఎవరీ చైల్డ్ రీడ్స్ ప్రోగ్రాంను మా పాఠశాలలో కొన్ని నెలలుగా విజయవంతంగా అమలు చేశామని పేర్కొన్నారు. విద్యార్థులకి ఉదయం పూట స్నాక్స్, మధ్యాహ్నం పుష్టికరమైన భోజనం, మినరల్ వాటర్, స్పోకెన్ ఇంగ్లీష్, కల్చర ఆక్టివిటీస్‌తో పాటు షూ, టై, బెల్ట్, ట్రావెలింగ్ సౌకర్యం అందచేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి బి.మురళీమోహన్, సర్పంచ్ బలుసుపాటి జయరాజు, గ్రామపెద్దలు, గ్రామ ప్రజలు అభినందనలు తెలిపారు.

# కలెక్టరేట్ వద్ద చలివేంద్రం ఏర్పాటు




**ప్రజాపక్షం/రఘునాథపాలెం :** వి. వెంకటాయపాలెంలోని నూతన కలెక్టరేట్ వద్ద గల ప్రయాణ ప్రాంగణంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. బుధవారం గ్రామంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ బాధ్యులు మాట్లాడుతూ కలెక్టరేట్‌కు వచ్చే ప్రజలు, వాహనదారుల దాహార్తిని తీర్చేందుకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చలివేంద్రం ఏర్పాటు పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ కుతుంబాక రాంప్రసాద్, వైస్ ఛైర్మన్ బానోత్ వీరన్న, కోశాధికారి గంగవరపు వసంత్, కార్యదర్శి కుతుంబాక బాబ్జీ, గౌరవ సభ్యులు చంద్ర సురేష్, కుతుంబాక కోటేశ్వరరావు, కుతుంబాక జగన్‌మోహన్‌రావు, ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి కృష్ణ, సిబ్బంది శివ తదితరులు పాల్గొన్నారు.

# మృతుల కుటుంబాలకు బియ్యం వితరణ



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** మండల పరిధిలోని చిమ్మపుడి గ్రామంలో మృతుల కుటుంబాలకు మాజీ ఉప సర్పంచ్ గుత్తా వెంకటేశ్వర్లు బియ్యం వితరణ చేశారు. బుధవారం గ్రామంలో ఇటీవల మృతిచెందిన ఖాసీం, అల్లం నాగమ్మ కుటుంబాలను గుత్తా వెంకటేశ్వర్లు పరామర్శించి కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. ఆయా కుటుంబాలకు 50 కేజీల చొప్పున బియ్యాన్ని అందజేశారు. గత ఎనిమిదేళ్లుగా గ్రామంలో రాజకీయాలకు అతీతంగా సేవ చేస్తున్నట్లు గుత్తా వెంకటేశ్వర్లు తెలిపారు. గ్రామంలో ఎవరైనా నిరుపేదలు మృతిచెందితే తన వంతు సాయంగా 50 కేజీల బియ్యాన్ని అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు గుత్తా చంద్రకళ, గుండ్ల ముత్తయ్య, దంతాల వెంకటేష్, మాజీ వార్డు సభ్యులు రాచర్ల రామ్మూర్తి, కంపసాటి వేణు, గంగిరెడ్డి విజయ్‌రెడ్డి, స్థానికులు నాగండ్ల బాబు, ముద్రబోయిన రామన్న, నీలం నాగేశ్వరరావు, నీలం వీరబాబు, పోతురాజు నాగేశ్వరరావు, ఉపేందర్, వేణు, కోటేశ్వరరావు, వీరబాబు, నాగమ్మ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# దెందుకూరులో చలివేంద్రం ప్రారంభం



**ప్రజాపక్షం/ మధిర :** మండల పరిధిలోని దెందుకూరు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని గ్రామ సర్పంచ్ పగిడిపల్లి శ్రీనివాసరావు, ఉపసర్పంచ్ రాయల ఝాన్సీవరలక్ష్మీ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోకి వచ్చే ప్రజలకు, కార్మికులకు, స్థానిక ప్రజలకు ఈ చలివేంద్రం ద్వారా చల్లని తాగునీరు అందుబాటులో ఉండటం వల్ల ఎంతో ఉపయోగంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి భాస్కర్‌రావు, గ్రామ పెద్దలు యడ్లపల్లి సంగయ్య, రాచకొండ వెంకటేశ్వరరావు, కర్లపూడి అప్పారావు, వీరయ్య, నర్సింహారావు, వై.సంగయ్య, హనమంతరావు, కృష్ణ, వార్డు మెంబర్లు, పంచాయతీ సిబ్బంది, పాల్గొన్నారు.

# ఇల్లెందు అభివృద్ధికి రూ.50 కోట్లు



**ప్రజాపక్షం/ కొత్తగూడెం :** ఇల్లెందు అభివృద్ధికి రూ.50 కోట్లు మంజూరు చేస్తున్నామని, వేసవిలో తాగునీటి యద్దడి లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని రెవెన్యూ, గృహ నిర్మాణ సమాచార, పౌరసంబంధాల శాఖామంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మంత్రి బుధవారం ఇల్లెందు మున్సిపాలిటీ పరిధిలో విస్తృతంగా పర్యటించారు. ఈ పర్యటనలో ఎంఎల్ఏ కోరం కనకయ్య, జిల్లా కలెక్టర్ అంకిత్, ఐటిడిఏ పిఓ రాహుల్ తదితరులు పాల్గొన్నారు. పదవ వార్డుల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులు తడికమల్ల భాగ్యమ్మ, కోడిమల్ల లక్ష్మీ గృహ ప్రవేశ కార్యక్రమంలో మంత్రి పాల్గొని ప్రారంభించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో నూతన చైర్పర్సన్ గదిని ప్రారంభించి చైర్పర్సన్ కిరణ్ మిత్రకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ ఇల్లెందు సమగ్రాభివృద్ధికి ముందుకు సాగాలన్నారు. ఎన్నికలసమయంలో ఇచ్చిన హామీల ప్రకారం నిదులు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. ప్రజల శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యమని, ప్రజాప్రతినిదులు ప్రజలతో నిత్యం సత్సంబంధాలు పెంచుకుని పనిచేస్తే మంచిఫలితాలు వస్తాయన్నారు. ప్రజాప్రభుత్వం నిత్యం ప్రజల కోసం పనిచేస్తుందని, నూతన ప్రజాప్రతిధిలు ప్రజాసమస్యల పరిష్కారం దిశగాపనిచేయాలన్నారు. అనంతరం ఎంఎల్ఏ కనకయ్య మాట్లాడుతూ

## మంత్రి పొంగులేటి హామీ

## వేసవితాగునీటి సమస్య లేకుండా చర్యలు

మంత్రి పొంగులేటి నాయకత్వంలో నియోజకవర్గాభివృద్ధి దిశగా ముందుకు సాగుతామని, ఇటీవల జరిగిన ఎన్నికల్లో మున్సిపాలిటీ పరిధిలో 200 నుండి 700 ఓట్ల మెజార్టీతో గెలుపొందారనిచెప్పారు. నూతన ప్రజాప్రతినిధులు ప్రభుత్వపథకాలు పేదల దరికిచేరేలా పనిచేయాలన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ అంకిత్, ఐటిడిఏ పిఓ రాహుల్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం పాటుపడుతోందని, ప్రభుత్వ పథకాలు పేదలు,గిరిజనుల దరిచేరేందుకు అనునిత్యం కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానికసంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, కొత్తగూడెం ఆర్డిఓ మధు, మున్సిపల్ వైస్ చైర్మన్ రాజు,అధికారులు రవీంధర్, తహశిర్దార్, ఎంపిడిఓతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# దుబ్బతండా చెరువు లూటీ, వివాదం

## -పలువురిపై కేసు నమోదు

**ప్రజాపక్షం/కారేపల్లి:** దుబ్బతండాలో చెరువులో చేపల లూటీ ఘటన ఉద్రికత్తకు దారితీసింది. చెరువు నుండి అనుమతి లేకుండా చేపలు పట్టే విషయంలో గ్రామంలో రెండు వర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. స్థానికుల సమాచారంతో విషయం బయటపడగా, ఒక వర్గం చెరువు చేపలు అక్రమంగా పడుతున్నారని ఆరోపించారు. దీనికి మరో వర్గం తీవ్రంగా ప్రతిస్పందించడంతో వాగ్వాదం చోటు చేసుకుని, పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో ప్రజలు ఆందోళనకు గురయ్యారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఎస్ఐ బైరు గోపి సంఘటనా విషయమై పరిస్థితిని సమీక్షించారు. చెరువు లూటీకి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని ఎస్ఐ పేర్కొన్నారు.

# జమలయ్యను అరెస్టు చేసిన పోలీసులు



**ప్రజాపక్షం /చుంచుపల్లి :** ఆర్‌టిసి డిపో, కొత్తగూడెం వద్ద బుధవారం శాంతియుతంగా ధర్నా చేస్తున్న ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్‌కు మద్దతుగా పూర్తి సంఘీభావం తెలుపుతూ ధర్నాలో పాల్గొన్న ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు కంచర్ల జమలయ్యను, ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నుండి కందుల భాస్కర్, సిపిఐ రాష్ట్ర సభ్యులు సలిగంటి శ్రీనివాస్, ఎఐటియుసి జాయింట్ సెక్రెటరీ గెద్దాడి నగేష్, సిపిఐ, ఎఐటియుసి, ఎన్‌ఎఫ్ఐడబ్ల్యు, గిరిజన సమాఖ్య, ప్రజాసంఘాలు నాయకులను అరెస్టు చేసి చుంచుపల్లి పోలీస్ స్టేషన్‌లో ఉంచారు. వీరినందరిని విడుదల చేయాలని ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు కంచర్ల జమలయ్య పోలీసులను డిమాండ్ చేశారు. ఈ అరెస్టులో గిరిజన నేత భూక్యా శ్రీనివాస్, షేక్ షాహీన్, షమీమ్, కైసర్, మేదిని లక్ష్మి , అంజం లక్ష్మి నారాయణ ఉన్నారు.

# వ్యాయామంతో ఒత్తిడికి దూరం

## జిమ్‌ను ప్రారంభించిన ఎంఎల్ఏ కూనంనేని



**ప్రజాపక్షం/పాల్వంచ :** ప్రతీ ఒక్కరు తమ దైనందిన జీవితంలో రోజు కొంత సమయం కేటాయించి వ్యాయామం చేయాలని ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు అన్నారు. స్థానిక ఎస్‌బిఐ బ్యాంకు ఎదురుశ్రీ జికెఆర్ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన ఫిట్‌నెస్ జిమ్, జుంబా స్టూడియోను బుధవారం ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు ప్రారంభించారు. జిమ్ పరికరాలను పరిశీలించారు. అనంతరం కూనంనేని మాట్లాడుతూ పాల్వంచలో అత్యాధునిక జిమ్‌ను ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. వ్యాయామంతో ఎన్నో లాభాలు ఉన్నాయని చెప్పారు. ప్రతీ రోజు బిజీగా గడిపే వారు తప్పకుండా (జిమ్) చేయాలని దీనితో శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఒత్తిడి తగ్గి ప్రశాంతత చేకూరుతుందన్నారు. అలాగే బీపి, షుగర్ లాంటి రుగ్మతలు దరి చేయవని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం మునిసిపల్ కార్పోరేషన్ మేయర్ మూడ్ గణేష్, కమీషనర్ సుజాత, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాధం, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అడుసుమిల్లి సాయిబాబ, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, టిపిసిసి జనరల్ సెక్రటరీ నాగా సీతారాములు, కార్పోరేటర్లు వీసంశెట్టి విశ్వేశ్వర్‌రావు, గొర్లె అన్నపూర్ణ, చెరుకు భాగ్యలక్ష్మి, దంతెబోయిన నరేష్, గొర్లె నరేష్, లాల్ పాషా,జిమ్ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ధాన్యం గింజకు మద్దతు ధరే లక్ష్యం

## -బూర్గంపాడులో కొనుగోలు కేంద్రం ప్రారంభం



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** ప్రతి ధాన్యం గింజకు మద్దతు ధరే లక్ష్యమని ఏడీఏ తాతారావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో సొసైటీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈకార్యక్రమానికి ఆయన, స్థానిక సర్పంచ్ మందా నాగరాజులు హాజరై వారి చేతుల మీదుగా కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజకు మద్దతు ధర కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులకు నేరుగా లాభం చేకూరుతుందన్నారు. రైతులు తమ ధాన్యాన్ని విక్రయించే సమయంలో నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని సూచించారు. ప్రభుత్వం కల్పించిన ఈ సౌకర్యాలను రైతులు పూర్తిగా వినియోగించుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ కేఆర్‌కే ప్రసాద్, మండల వ్యవసాయ అధికారి ఆర్ శంకర్, ఉప సర్పంచ్ గుండె వెంకన్న, సొసైటీ సీఈవో ప్రసాద్, ఏటీఎం పవన్ కుమార్, కాంగ్రెస్ పార్టీ జిల్లా లీగల్ సెల్ కన్వీనర్ భజన సతీష్ కుమార్, రైతులు భజన నాగం, భజన నరసింహారావు, పేరం వెంకటరెడ్డి, మేకల వెంకన్న, గోనెల వెంకటేశ్వర్లు, గోనెల సతీష్, గాదె వెంకటేశ్వరరెడ్డి, పాశం రాజు, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

# ఖమ్మం నగరాన్ని ఆదర్శంగా నిలపాలి

## -అభివృద్ధి పనులకు మంత్రి తుమ్మల శంకుస్థాపన



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మంను శాంతియుత వాతావరణంతో పాటు పరిశుభ్రమైన నగరంగా ఆదర్శవంతంగా నిలపాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఖమ్మం కార్పోరేషన్ పరిధిలోని ఆర్టివో కార్యాలయం వద్ద రూ.1.46 కోట్ల వ్యయంతో ఆర్టివో కార్యాలయం నుంచి బైపాస్ రోడ్డు వరకు చేపట్టిన రోడ్డు విస్తరణ, సైడ్ డ్రైన్ నిర్మాణ పనులు, విజయ నగర్ కాలనీలో రూ.50.85 లక్షలతో అంతర్గత సిసి రోడ్లు, డ్రైన్ నిర్మాణ పనులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ ఖమ్మం నగరంలో విస్తృత రహదారులు, 24 గంటలు త్రాగునీటి సరఫరా, నిరంతర విద్యుత్ సరఫరాతో అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. శాంతియుత వాతావరణాన్ని కల్పించడంతో పాటు పరిశుభ్రమైన నగరంగా ఖమ్మంను తీర్చిదిద్దుతామన్నారు. రాష్ట్రంలో ఇతర మున్సిపాలిటీలు ఖమ్మంను ఆదర్శంగా తీసుకునేలా అభివృద్ధి చేస్తామన్నారు. పేద, మధ్య తరగతి, ధనికులు అనే తేడా లేకుండా అందరికీ అవసరమైన సదుపాయాలు ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. త్వరలో ఖమ్మంకు రింగ్ రోడ్డు ఏర్పాటు కానుందని ట్రాఫిక్ సమస్య త్వరలో పరిష్కారం అవుతుందన్నారు. మేయర్ పునుకొల్లు నీరజ మాట్లాడుతూ మంత్రి తుమ్మల అంటేనే అభివృద్ధి అని ఖమ్మం నగరాన్ని నలువైపులా సమగ్రంగా అభివృద్ధి చేస్తున్నారన్నారు. మోడల్ మార్కెట్, కేబుల్ బ్రిడ్జి, మున్నేరు రిటైనింగ్ వాల్ పనులు జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం నగర కమిషనర్ అభిషేక్ అగస్త్య, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, సంబంధిత జిల్లా అధికారులు, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

# గురుకులాల్లో నాణ్యమైన విద్య, వసతులు కల్పించాలి



**ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి:** అన్నపురెడ్డిపల్లి మండలంలో ప్రజాపాలన, ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న వెల్ఫేర్ వారోత్సవాల సందర్భంగా మండల స్పెషల్ ఆఫీసర్ అరుణ భారతి గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. మండల పరిధిలోని గురుకులాల్లో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, విద్యా ప్రమాణాలు, వసతి పరిస్థితులను ఆమె పరిశీలించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు, అవసరాలను తెలుసుకున్నారు. ఈసందర్భంగా అరుణ భారతి మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యం విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు అందించడం అని తెలిపారు. గురుకులాల్లో ఆహారం, పరిశుభ్రత, భద్రత అంశాల్లో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థుల అభివృద్ధి కోసం అమలు చేస్తున్న కార్యక్రమాల్లో నిర్లక్ష్యం సహించబోమని హెచ్చరించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ తనిఖీల్లో ఎంపీడీవో మహాలక్ష్మి, ఎంపీఓ షబ్నా, గురుకుల ప్రిన్సిపాల్స్ కవిత, బాలరాజు, వార్డెన్ రాంబాబు, సంబంధిత శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఖాళీ బస్తాల ధరలు పెంచండి

## -రైతు సంఘాల డిమాండ్

## -రైతు సంఘాలతో మార్కెట్ అధికారులు సమావేశం





**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో రైతులకు చెల్లిస్తున్న ఖాళీ బస్తాల ధరలు పెంచాలని రైతు సంఘాలు డిమాండ్ చేశాయి. బుధవారం ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు అధ్యక్షతన రైతు సంఘాలు, చాంబర్ బాధ్యులు, వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మార్కెట్‌కు రైతులు తీసుకు వచ్చే పంట ఉత్పత్తులకు సంబంధించి ఖాళీ బస్తాలకు చెల్లించే ధరపై చర్చించారు. ప్రస్తుతం ఖాళీ బస్తాలకు చెల్లించే ధర రూ. 25లు ఉండగా దానిని రూ. 80లు పెంచాలని రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. అదేవిధంగా రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా మార్కెట్‌లో చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఛైర్మన్ హన్మంతరావు మాట్లాడుతూ ఖాళీ బస్తా ధర పెంచే విషయానికి సంబంధించి సమావేశం నిర్వహించినట్లు ఆయన తెలిపారు. రైతు సంఘాల డిమాండ్‌కు సంబంధించి వచ్చే వారం సమావేశం నిర్వహించి ధర నిర్ణయిస్తామని తెలిపారు. అనంతరం ఆధునీకరణ పనులు చేపడుతున్న మిర్చి యార్డ్‌ను రైతు సంఘాల నాయకులు, వ్యాపారులు సందర్శించారు. అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనుల పట్ల హర్షం వ్యక్తం చేస్తూ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ వైస్ ఛైర్మన్ తల్లాడ రమేష్, రైతు సంఘాల నాయకులు దొండపాటి రమేష్, అడపా రామకోటయ్య, నల్లమల వెంకటేశ్వరరావు, బొంతు రాంబాబు, నాగులమీరా, కోలేటి నాగేశ్వరరావు, చాంబర్ బాధ్యులు, వ్యాపారులు, మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, అసిస్టెంట్ కార్యదర్శి వీరాంజనేయులు పాల్గొన్నారు.

# సెమీఫైనల్ కు అర్హత సాధించిన తెలంగాణ రాష్ట్ర బీచ్ వాలీబాల్ బాలుర టీమ్



**ప్రజాపక్షం/కరకరగూడెం:** ఎస్‌జిఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర బీచ్ వాలీబాల్ బాలుర టీమ్ సెమీఫైనల్ కు అర్హత సాధించింది. గోవా రాష్ట్రంలోని మీరామర్ పనాజీ వద్ద నిర్వహిస్తున్న జాతీయ స్థాయి బీచ్ వాలీబాల్ పోటీలలో తెలంగాణ బాలుర జట్టు సెమీఫైనల్స్‌కు అర్హత సాధించింది. బుధవారం సాయంత్రం 4:45 గంటలకు తెలంగాణ వెర్సెస్ పంజాబ్ పై 20 స్కోర్ తో గెలుపొంది సెమీ ఫైనల్ కు హర్హత సాధించింది. ఈ సందర్భంగా ప్లేయర్స్ జి. విష్ణు వర్ధన్ ఇంటర్ ఫస్ట్ ఇయర్, ప్రభుత్వ జూనియర్ కాలేజ్, పాల్వంచ, వై. రిషివర్మ 9వ తరగతి, ప్రభుత్వ టిడబ్ల్యూ మోడల్ క్రీడా పాఠశాల, కిన్నెరసాని, బి. కార్తిక్ పదవ తరగతి జట్పిహెచ్‌ఎస్ ఆర్‌ఆర్‌ఆర్ కాలనీ, గాజ్వేల్, సిద్దిపేట జిల్లా తదితరులను తెలంగాణ బాలుర టీమ్ ఆఫీసియల్స్ కొమరం వెంకటనారాయణ కోచ్ కె. రామానందం అసిస్టెంట్ కోచ్ వై. రామారావు తదితరులు అభినందించారు.

# పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

**-ఆర్థిక ఇబ్బందులు ఉన్న సంక్షేమ పథకాలు కొనసాగింపు**

**-చెక్కుల పంపిణీలో మంత్రి పొంగులేటి**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** పేదల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. బుధవారం ఖమ్మంలోని పొంగులేటి క్యాంపు కార్యాలయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఖమ్మం నగరంలోని 1, 59, 60 డివిజన్లకు చెందిన 27 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్బంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేలా ప్రజా ప్రభుత్వం సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేదల గడప వద్దకే పథకాలు చేరవేస్తున్నామన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు క్లిష్టంగా ఉన్న గత ప్రభుత్వంలో ప్రారంభించిన మంచి పథకాలను నిలిపివేయకుండా కొనసాగిస్తున్నామన్నారు. వాటితో పాటు అదనంగా మహిళలకు ఆర్టిసి బస్సుల్లో ఉచిత ప్రయాణం, అర్హులకు కొత్త రేషన్‌కార్డులు, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రెండు లక్షల రుణమాఫీ, రైతు భరోసా క్రింద ఎకరానికి ఆరువేలు, సన్న ధాన్యానికి రూ. 500 బోనస్‌తో పాటు మద్ధతు ధర అందిస్తున్నామన్నారు. విద్య, ఆరోగ్య రంగాలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తుందన్నారు. ఆపదలో ఉన్న పేదలను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా లబ్ది చేకూరుస్తున్నామన్నారు.పేద పిల్లలకు అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యను అందించేందుకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మిస్తున్నామన్నారు. గత ప్రభుత్వం ఇండ్ల పేరుతో పేదలను మోసం చేసిందని, తమ ప్రభుత్వం తొలి దశలోనే 4.5 లక్షల ఇండ్లు మంజూరు చేసిందన్నారు.ఈ కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, ఏదులాపురం మున్సిపల్ ఛైర్‌పర్సన్ అనిత, పాలేరు నియోజక వర్గ ప్రత్యేకాధికారి రమేష్, ఆర్డీవో శ్రీనివాస్, అర్బన్ తహాసీల్దార్ జయచందర్, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# అభివృద్ధి ఫలితాలు ప్రజలకు చూపాలి

**-మొక్కజొన్న 2.17 లక్షల టన్నులు, ధాన్యం 2.37 లక్షల టన్నులు కొనుగోలు లక్ష్యం**

**-రూ. 92 కోట్లతో స్పోర్ట్స్ హబ్ ప్రతిపాదనలు**

**-అభివృద్ధి పనులపై మంత్రి తుమ్మల సమీక్ష**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేసి వాటి ఫలితాలు ప్రజలకు చూపాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కలెక్టర్ అనుదీప్‌దురిశెట్టి, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి తో కలిసి పౌర సరఫరాలు, మార్కెటింగ్, మార్క్‌ఫెడ్, పంటల కొనుగోలు, మున్నేరు రిటైనింగ్ వాల్ నిర్మాణ ప్రగతి, ఖమ్మం కార్పోరేషన్‌లో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ పంటల కొనుగోళ్లు, నగరాభివృద్ధి పనులను ఎటువంటి ఆటంకం లేకుండా వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. జూన్ మొదటి వారానికి బైపాస్ నుంచి కేబుల్ బ్రిడ్జి వరకు మున్నేరు రిటైనింగ్ వాల్ ఎడమ, కుడి వైపుల పనులు పూర్తి చేయాలని చిన్న గ్యాప్ కూడా ఉండకుండా యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఖమ్మం నగరాన్ని స్పోర్ట్స్ హబ్‌గా అభివృద్ధి చేసే దిశగా ఇండోర్ స్టేడియం, క్రికెట్ స్టేడియం, క్రీడాకారుల వసతి గృహాలు, అతిథి గృహం, కన్వెన్షన్ హాల్ వంటి సదుపాయాలతో 20 ఎకరాల్లో రూ.92 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. కనీసం 50 శాతం కేంద్ర నిధులు సమీకరించేలా చర్యలు తీసుకోవాలని 200 మంది క్రీడాకారులకు వసతి కల్పించేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. సింథటిక్ రన్నింగ్ ట్రాక్ అత్యున్నత నాణ్యతతో నిర్వహించబడిందని దానికి సరైన నిర్వహణ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి త్వరలోనే క్రీడా కార్యక్రమాలు ప్రారంభించాలన్నారు. వెలుగుమట్ల అర్బన్ పార్కులో రోడ్డు డివైడర్ అధిక స్థలం ఆక్రమిస్తుందని భవిష్యత్తులో మార్పులు చేయాలని, ఆకర్షణీయమైన మొక్కలు పెంచాలని సూచించారు. ధంస లాపురం ఎస్‌టిపి స్థలాన్ని మూడు రోజుల్లో అప్పగించి వర్షాకాలానికి ముందే పనులు పూర్తి చేయాలన్నారు. ఖిల్లా రోప్‌వే నిర్మాణంలో వర్షాల వల్ల పనులు ఆగకుండా వర్షాకాలం ముందే పూర్తి చేయాలన్నారు. మార్కెట్ అభివృద్ధి పనులు, పంటల కొనుగోళ్లు సమాంతరంగా జరగాలన్నారు. సోలార్ పవర్ వినియోగంపై ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు.వరి కొనుగోళ్లలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకూడదని ఇతర జిల్లాలతో సమన్వయం చేసుకుని ధాన్యం తరలింపు చేపట్టాలన్నారు. కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ జిల్లాలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని 4.34 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి అంచనా ఉండగా 2.17 లక్షల మెట్రిక్ టన్నులు లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. 2,37,500 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు 308 కేంద్రాలు ప్రతిపాదించగా 240 కేంద్రాలు ప్రారంభించామని తెలిపారు. 45 లక్షల గన్ని సంచులు అందుబాటులో ఉన్నాయన్నారు. టియుఎఫ్ఐడిసి క్రింద 66 పనులు మంజూరు కాగా 63 పూర్తయ్యాయని మిగిలిన మూడు పనులు చివరి దశలో ఉన్నాయన్నారు. ఈ సమావేశంలో ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఖమ్మం నగరాన్ని ఆదర్శంగా నిలపాలి

**-అభివృద్ధి పనులకు మంత్రి తుమ్మల శంకుస్థాపన**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మంను శాంతియుత వాతావరణంతో పాటు పరిశుభ్రమైన నగరంగా ఆదర్శవంతంగా నిలపాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఖమ్మం కార్పోరేషన్ పరిధిలోని ఆర్టీవో కార్యాలయం వద్ద రూ.1.46 కోట్ల వ్యయంతో ఆర్టీవో కార్యాలయం నుంచి బైపాస్ రోడ్డు వరకు చేపట్టిన రోడ్డు విస్తరణ, సైడ్ డ్రైన్ నిర్మాణ పనులు, విజయ నగర్ కాలనీలో రూ.50.85 లక్షలతో అంతర్గత సిసి రోడ్లు, డ్రైన్ నిర్మాణ పనులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ ఖమ్మం నగరంలో విస్తృత రహదారులు, 24 గంటలు త్రాగునీటి సరఫరా, నిరంతర విద్యుత్ సరఫరాతో అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. శాంతియుత వాతావరణాన్ని కల్పించడంతో పాటు పరిశుభ్రమైన నగరంగా ఖమ్మంను తీర్చిదిద్దుతామన్నారు. రాష్ట్రంలో ఇతర మున్సిపాలిటీలు ఖమ్మంను ఆదర్శంగా తీసుకునేలా అభివృద్ధి చేస్తామన్నారు. పేద, మధ్య తరగతి, ధనికులు అనే తేడా లేకుండా అందరికీ అవసరమైన సదుపాయాలు ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. త్వరలో ఖమ్మంకు రింగ్ రోడ్డు ఏర్పాటు కానుందని ట్రాఫిక్ సమస్య త్వరలో పరిష్కారం అవుతుందన్నారు. మేయర్ పునుకొల్లు నీరజ మాట్లాడుతూ మంత్రి తుమ్మల అంటేనే అభివృద్ధి అని ఖమ్మం నగరాన్ని నలువైపులా సమగ్రంగా అభివృద్ధి చేస్తున్నారన్నారు. మోడల్ మార్కెట్, కేబుల్ బ్రిడ్జి, మున్నేరు రిటైనింగ్ వాల్ పనులు జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం నగర కమిషనర్ అభిషేక్ అగస్త్య, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, సంబంధిత జిల్లా అధికారులు, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

# క్రీడలు పట్టుదలను పెంచుతాయి

**ప్రజాపక్షం/పాల్వంచ :** క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటుగా గెలవాలనే పట్టుదలను పెంచుతాయని టిపిసిసి జనరల్ సెక్రటరి నాగా సీతా రాములు అన్నారు. మండల పరిధి సంగం గ్రామంలో నిర్వహించిన సంగం ప్రీమియర్ లీగ్ 4వ, సీజన్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలను నిర్వహించారు. ఈ సంధర్భంగా విజేతలకు నగదు బహుమతులు, ట్రోఫీలను బుదవారం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామీణ యువత క్రీడల పట్ల మక్కువ పెంచుకోవాలని సూచించారు. పోటీల్లో గెలుపు ఓటములను సమానంగా తీసుకోవాలని, నేటి ఓటమిని రేపటి గెలుపు కోసం బాటలు వేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాగారం సర్పంచ్ స్వప్న, ఉప సర్పంచ్ ఎర్రపోతు సంతోష్, టోర్నమెంట్ ఆర్గనైజర్స్ మెంటం బలరాం, చింతల లక్ష్మణ్, పిల్లి సర్వేష్, తిరుమలరెడ్డి, శరత్, బోరం యేసు, రెంటాల సుందర్‌రావు, మండల కిసాన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మెంటెం రాము, మోదుంపురం సంతోష్, పాకాల కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

# యూనివర్సల్‌లో సమ్మర్ క్రికెట్ కోచింగ్ క్యాంప్ ప్రారంభం



**ప్రజాపక్షం/ తల్లాడ :** స్థానిక యూనివర్సల్ విద్యాలయంలో సమ్మర్ క్రికెట్ క్యాంప్‌ను పాఠశాల డైరెక్టర్ మేరి సోఫియా, జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి మతీన్‌లు బుధవారం ప్రారంభించారు. బిసిసిఐ గుర్తింపు పొందిన కోచ్ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జరుగుతున్న కోచింగ్ క్యాంప్ 50రోజులు ఉంటుందని వారు తెలిపారు. ఈ కోచింగ్ క్యాంపులో బౌలింగ్, బ్యాటింగ్, ఫీల్డింగ్ నేర్పించటం జరుగుతుందని అన్నారు. ప్రతిరోజు ఉదయం 6గంటల నుండి 9గంటల వరకు, సాయంత్రం 4గంటల నుండి 7గంటలవరకు ప్రాక్టీస్ ఉంటుందని కోచ్ నాగేశ్వరరావు తెలిపారు. ఈ సదుపాయాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఆసక్తిగల వారు 9000069047 నెంబర్‌కు సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలుర క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి మతీన్, రాము, యాకోబు, మోహన్, మనీషా, రవి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు అవగాహన



**ప్రజాపక్షం/పెనుబల్లి:** ప్రపంచ భూ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఖమ్మం, తల్లాడ రేంజ్ అటవీ శాఖ, పర్యావరణ పరిరక్షణ ప్రాముఖ్యత, సహజ వనరులను బాధ్యతాయుతంగా ఉపయోగించడంపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు బుధవారం పెనుబల్లి ప్రభుత్వ పాఠశాలలో ఒక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమంలో పిల్లలకు సులభమైన, ఆచరణాత్మక సందేశాల ద్వారా భూ వనరుల సుస్థిర వినియోగం, పర్యావరణ నిర్వహణ ఆవశ్యకతను తెలియజేశారు. భవిష్యత్ తరాల కోసం చెట్లు, నీరు, నేల, ఇతర సహజ వనరులను ఎలా పరిరక్షించాలో అధికారులు వివరించారు. పర్యావరణ అనుకూల అలవాట్లను పెంపొందించుకోవాలని, వనరుల వృధాను నివారించాలని, పరిశుభ్రమైన, పచ్చని పర్యావరణానికి తోడ్పడే కార్యకలాపాలలో పాల్గొనాలని విద్యార్థులను ప్రోత్సహించారు. ప్రకృతికి బాధ్యతాయుతమైన సంరక్షకులుగా మారేలా యువతను ప్రేరేపించడమే ఈ కార్యక్రమం యొక్క లక్ష్యం. భూమి యొక్క రక్షణ, పరిరక్షణ కోసం విద్యార్థులు మరియు ప్రజలలో పర్యావరణ అవగాహనను వ్యాప్తి చేయడానికి తమ నిబద్ధతను అటవీ శాఖ పునరుద్ఘాటించింది. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎస్ఓ కాలు, డివైఆర్ఓ సురేష్ కుమార్, ఎఫ్‌బిఓలు అరుణ కుమారీ, మస్తాన్ రావు, సమత, లావణ్య, నాగరాజు, సాత్విక్, అనిల్, స్కూల్ హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, పిల్లలు పాల్గొన్నారు.

# స్మశాన వాటికను పరిశీలించిన చైర్‌పర్సన్ సుజాత



**ప్రజాపక్షం/ మధిర :** మధిర పట్టణంలోని 2వడివిజన్‌లో ఆక్రమణకు గురైన స్మశాన వాటికను మధిర మున్సిపాలిటీ డెవలప్మెంట్ కమిటీ సభ్యులు బుధవారం పరిశీలించారు. డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క ఆదేశాల మేరకు మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని సుజాత, మున్సిపల్ డెవలప్మెంట్ సభ్యులు మిర్యాల వెంకటరమణగుప్త, వేమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, వాసిరెడ్డి రామనాథం, బెజవాడ రవిబాబు, తన్నీర రామకృష్ణ తదితరులు స్మశాన వాటికను పరిశీలించారు. ఇక్కడ చోటుచేసుకున్న ఆక్రమణలపై వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు స్మశాన వాటికను రక్షించి అందుబాటులో ఉంచాలని కోరారు. దీనికి స్పందించిన అధికారులు, డెవలప్మెంట్ కమిటీ సభ్యులు ఆక్రమణలు తొలగించి ప్రభుత్వ భూమిని పరిక్షించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే భవిష్యత్‌లో ఇటువంటి సమస్యలు తలెత్తకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహాశీల్దార్ ఆర్.రాంబాబు, కమీషనర్ సంపత్‌కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ కోన ధనికుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు బొల్లెదు రాజేంద్ర, షేక్.గౌసుద్దీన్, సజ్జా ప్రసాద్, కొంగర రవి, గాలీబ్ పాషా తదితరులు పాల్గొన్నారు.

# బస్సులు నిల్.. ఆటోలు ఫుల్..



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు లోని ప్రయాణికుల బస్టాండ్ వద్ద, కొత్త బస్టాండ్, పాత బస్టాండు, ఎన్‌ఎస్పి అంబేద్కర్ నగర్ ల వద్ద ప్రయాణికుల ప్రాం గణాల వద్ద ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆర్టీసీ కార్మికులు సమ్మెతో బస్సులు స్తంభించి పోవడం వలన ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. దీంతో ఆటోలు ప్రైవేటు వాహనాలపై ఆధారపడి తమ అవసరాలను తీర్చుకున్నారు. దూర ప్రాంతాలు వెళ్తున్నా ప్రయాణికులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించారు. ఈ సందర్భంగా ఇదే అదునుగా భావించి ఆదనపు ధరలు పెంచి బాదారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాలకు చేరుతున్న ప్రజలు,ఉద్యోగులు ఆధార్ కార్డుపై ఆధారపడిన వారు ఇబ్బందులు పడ్డారు. దీంతో రోడ్డుపై చెట్లు కింద ప్రయాణికులు పాట్లు పడ్డారు. ప్రతిరోజు వేచి ఉండే స్థలాలు ప్రాంగణాలైనా కొత్త బస్టాండు పాత బస్టాండు ఎన్‌ఎస్పి ప్రాంతాలలో ప్రాంగణాలు వెల వెల పోయాయి. ప్రధానంగా ప్రయాణికులు ఆర్టీసీ సమ్మెను కార్మికులతో మాట్లాడి చర్చించి విరమించాలని ప్రభుత్వాన్ని ప్రయాణికులు ప్రజలు కోరుతున్నారు.

# పోషణ్ పక్వాడ కార్యక్రమం

**ప్రజాపక్షం/కరకగూడెం:** అనంతారం సెక్టార్ కొత్తగూడెం అంగన్వాడి కేంద్రంలో బుధవారం పోషణ్ పక్వాడ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీ స్త్రీ కి శ్రీమంతం చేసి తగు జాగ్రత్తలు తీసుకోవాలని సలహాలు,1000 డేస్ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ రాజమణి, సర్పంచ్ ఎర్రం పొట్టయ్య, ఉప సర్పంచ్ కొమరం నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి ఈశాల సురేష్, అంగన్వాడి టీచర్స్ సుజాత, శిరీష, ఆశా కార్యకర్త లక్ష్మీ బాయి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. అలాగే గర్భిణీ స్త్రీ తీసుకునే ఆహారం, జాగ్రత్తలు, చిరు ధాన్యాలు, ప్రాముఖ్యత, తల్లిపాల ప్రాముఖ్యత, పోషకాహారంపై అవగాహన కల్పించారు.